సాక్షి
అనంతపురం

శుక్రవారం । 10 । జనవరి । 2025



టన్ను చీనీ రూ.24,190

అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.24,190 పలికాయి.



కిలో టమాట రూ.11

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.11, కనిష్టంగా రూ.7, సరాసరిన రూ.9 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
34.7°/11.9°

జిల్లా అంతటా గురువారం చలి వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

పటిష్ట బందోబస్తు



ఎస్పీ పి. జగదీష్

అనంతపురం: వైకుంఠ ఏకాదశి రోజైన శుక్రవారం జిల్లాలోని దేవాలయాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ పి. జగదీష్ పేర్కొన్నారు. దేవాలయాలు, పరిసరాల్లో అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. రద్దీకి అనుగుణంగా పోలీసు సిబ్బందిని కేటాయించామన్నారు. భక్తులు అసౌకర్యానికి గురి కాకుండా ఏర్పాట్లు చేయాలని దేవాలయ కమిటీలకు సూచించామన్నారు. భక్తుల తాకిడి అధికంగా ఉండే ఆలయాల వద్ద బ్యారికేడ్లు, క్యూ నిర్వహణ తప్పనిసరిగా పాటించాలన్నారు. దొంగతనాల కట్టడికి ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. గస్తీ పెంచామని, మొబైల్ సెక్యూరిటీ హ్యాండ్ హోల్డ్ డివైజెస్ ద్వారా అనుమానితులను పరిశీలించనున్నట్లు ఎస్పీ వెల్లడించారు.

నేడు మునిసిపల్ టీచర్లకు పదోన్నతులు

అనంతపురం ఎడ్యుకేషన్: అనంతపురం కార్పొరేషన్‌తో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మునిసిపాలిటీ స్కూళ్లలో ఖాళీగా ఉన్న పీఎస్‌హెచ్‌ఎం, పాఠశాల సహాయకుల (తెలుగు, హిందీ, ఉర్దూ) పోస్టుల భర్తీకి శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్‌బాబు తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే తుది సీనియార్టీ జాబితాను డీఈఓ బ్లాగ్ https://deoananthapuramu.blogspot.comలో ఉంచామన్నారు. సర్వీస్ రిజిస్టర్, ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉదయం 11 గంటలకు డీఈఓ కార్యాలయానికి చేరుకోవాలని సూచించారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి



పత్తి పంటను పరిశీలిస్తున్న హ్యాండ్‌లూమ్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సునీత, కలెక్టర్ వినోద్‌కుమార్

పెద్దవడుగూరు: సేంద్రియ ఎరువుల వాడకంతో అధిక దిగుబడి సాధించవచ్చని హ్యాండ్‌లూమ్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సునీత, కలెక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని మిడుతూరు గ్రామంలో దేశీ రకం పత్తి పంట సాగు పొలాలను వారు పరిశీలించారు. బీటీ పత్తి, నాన్ బీటీ పత్తి సాగు వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. దేశీ రకం పత్తి సాగుకు కేవలం జీవామృతం వాడుతున్నామని రైతులు తెలిపారు. అంతర పంటలుగా సజ్జ, అలసంద, కూరగాయలు సాగు చేసుకుంటున్నామన్నారు. రసాయన ఎరువులు వాడిన పత్తికి, జీవామృతం వాడిన పత్తికి చాలా వ్యత్యాసముంటుందన్నారు. దేశీ రకం పత్తి నాణ్యతగా ఉంటుందని, నాణ్యమైన కాటన్ దుస్తుల తయారీకి బాగా ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో జేడీఏ ఉమామహేశ్వరమ్మ, డీపీఎం లక్ష్మానాయక్, తహసీల్దార్ ఉషారాణి, ఏఓ మల్లీశ్వరి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శిశువు మృతి

- టీకా వికటించడంతోనే ప్రాణం పోయిందని తల్లిదండ్రుల ఆరోపణ

డీ హీరేహాళ్ (రాయదుర్గం): ముక్కుపచ్చలారని 8 నెలల పసికందు మృతి చెందిన ఘటన డీ హీరేహాళ్ మండలం కుడ్లూరులో విషాదం నింపింది. అయితే, టీకా వికటించడంతోనే బిడ్డ ప్రాణం పోయిందని తల్లిదండ్రులు ఆరోపించడంతో వైద్య సిబ్బందిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రామానికి చెందిన భాస్కర్ భార్య రేణుక 8 నెలల క్రితం ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. గురువారం ఉదయం శిశువుకు స్థానిక వైద్య సిబ్బంది టీకా వేశారు. ఈ క్రమంలోనే సాయంత్రం 4 గంటల సమయంలో శిశువు ఉన్నట్టుండి మృతి చెందింది. బిడ్డ మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. టీకా వికటించడంతోనే కన్నుమూసిందని ఆరోపించారు. విచారించి న్యాయం చేయాలని కోరారు. తమలా మరొకరు బిడ్డను కోల్పోకుండా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'ప్రీమియం స్టోర్' దరఖాస్తు గడువు పొడిగింపు

అనంతపురం: నగరంలో మద్యం ప్రీమియం స్టోర్ ఏర్పాటుకు సంబంధించి దరఖాస్తు గడువును ఈ నెల 18వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి బి. రామమోహన్ రెడ్డి తెలిపారు. దరఖాస్తు రుసుం రూ.15 లక్షలు (నాన్- రీఫండబుల్)గా నిర్దేశించినట్లు పేర్కొన్నారు. రూ. కోటి లైసెన్స్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. 18వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు జిల్లా ఎక్సైజ్ అధికారి కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు.

'ఇల వైకుంఠం'.. స్వామి కటాక్షం



అనంతపురంలో ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

ముక్కోటి ఏకాదశి పర్వదినానికి జిల్లాలోని వైష్ణవాలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. గురువారం అర్ధరాత్రి నుంచే భక్తులు ఆలయాల వద్ద బారులు తీరారు. భక్తులకు ఇక్కట్లు తలెత్తకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ముక్కోటి ఏకాదశిని వైకుంఠ ఏకాదశి అని కూడా పిలుస్తారు. ఆ రోజు స్వామి వారిని ఉత్తర ద్వారం నుంచి దర్శనం చేసుకుంటే పుణ్యం లభిస్తుందని భక్తుల నమ్మకం. అందుకే ఆ రోజు ఆలయాలు భక్తులతో పోటెత్తుతాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



భక్తుల కోసం అనంతపురం చెన్నకేశవ స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు



విద్యుద్దీప కాంతుల నడుమ ఆర్‌ఎఫ్ రోడ్డు లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయం

డాకు.. బ్రేకు

రూ.లక్షలు ఖర్చు చేశారు. పెద్ద పెద్ద కటౌట్లు కట్టారు. ప్రభుత్వం కూడా పూర్తిగా సహకరించడంతో నగరాన్ని అభిమాన హీరో పోస్టర్లతో నింపేశారు. కానీ, అనుకోని ఓ ఘటన ఆశలపై నీళ్లు చల్లింది. భవిష్యత్తులో సినిమా కలెక్షన్లపై కూడా ఈ ప్రభావం పడుతుందనే ఆందోళన పెంచింది. హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు బాలకృష్ణ నటించిన 'డాకు మహారాజ్' సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్ రద్దు కావడంతో అభిమానుల్లో కలవరం మొదలైంది.



అనంతపురం నగరంలో వెలసిన డాకు మహారాజ్ ఫ్లెక్సీలు

- 'డాకు మహారాజ్' ప్రీ రిలీజ్ ఫంక్షన్ రద్దు
- తిరుపతి తొక్కిసలాట ఘటనతో నిర్ణయం
- సినిమా ఫలితాలపై ప్రభావం పడుతుందని ఆందోళన

సాక్షి ప్రతినిధి, అనంతపురం: బాలకృష్ణ హీరోగా నటించిన 'డాకు మహారాజ్' సినిమాకు రిలీజ్‌కు ముందే ఎదురుదెబ్బ తగిలింది. రాయలసీమ జిల్లాల్లో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను ఏర్పాటు చేసి భారీ ప్రచారంతో ముందుకెళ్లాలనుకున్న చిత్ర బృందంపై తిరుపతి తొక్కిసలాట ఘటన రూపంలో కోలుకోలేని దెబ్బ పడింది. గురువారం సాయంత్రం అనంతపురంలో అట్టహాసంగా కార్యక్రమాన్ని నిర్వహించి ఇటు రాయలసీమ జిల్లాలతో పాటు కోస్తా జిల్లాల్లోనూ మీడియా కవరేజీతో లబ్ధి పొందాలని భావించారు. కానీ 'అనుకున్నదొక్కటి అయ్యిందొక్కటి' అన్న చందాన ప్రచారానికి ఆదిలోనే హంసపాదు ఎదురైంది. గతంలో ఎన్నడూ లేని విధంగా బాలకృష్ణ సినిమా ప్రీరిలీజ్



డాకు మహారాజ్ ప్రీ రిలీజ్ ఫంక్షన్ ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ జగదీష్ (ఫైల్)

ఫంక్షన్‌ను ప్రభుత్వ కార్యక్రమంగా భావించి పోలీసులు రెండు రోజులుగా ఏర్పాట్లలో మునిగి తేలారు. ఒక సినిమా ఈవెంట్‌కు స్వయానా జిల్లా ఎస్పీ ఏర్పాట్లు పరిశీలించడం, పోలీసులందరూ అక్కడే ఉండి పనిచేయడం తీవ్ర విమర్శలకు దారి తీసిన విషయం తెలిసిందే.

పుష్ప, గేమ్ ఛేంజర్‌లకు దీటుగా..

గతంలో పుష్ప ప్రీ రిలీజ్ ఫంక్షన్ జరిగింది. ఆ తర్వాత సినిమా కూడా హిట్ అయి పాన్ ఇండియా స్థాయిలో అత్యధిక కలెక్షన్లు సాధించింది. చిరంజీవి తనయుడు రామ్‌చరణ్ నటించిన 'గేమ్ ఛేంజర్' సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్ ఇటీవల కాకినాడలో నిర్వహించారు. ఈ ఫంక్షన్‌కు రామ్‌చరణ్ బాబాయి, డిప్యూటీ సీఎం అయిన పవన్‌కల్యాణ్ హాజరయ్యారు. ఇదే తరహాలోనే బాలకృష్ణ సినిమా 'డాకు మహారాజ్' సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్ నిర్వహించాలని అనుకున్నారు. బాలకృష్ణ అల్లుడు, మంత్రి లోకేష్ కూడా కార్యక్రమానికి హాజరుకావాలని నిర్ణయించారు. గేమ్ ఛేంజర్‌కు పవన్‌కల్యాణ్ ఎలా ప్రచారం చేశారో ఆ తరహాలోనే లోకేష్ చేస్తారని అంతా అనుకున్నారు. ఈ క్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో 14 మంది ఎమ్మెల్యేలూ జన సమీకరణ చేశారు. అయితే, బుధవారం తిరుపతిలో తొక్కిసలాట జరిగి ఆరుగురు మృతి చెందడంతో ప్రీ రిలీజ్ ఫంక్షన్‌ను రద్దు చేశారు.

రూ. లక్షలు ఖర్చు చేసినా నిరాశ

బుధవారం సాయంత్రం 4 గంటల నుంచే బాలకృష్ణ అభిమానులు అనంతపురం నగరం నిండా ఫ్లెక్సీలు వేశారు. గల్లీ గల్లీలో భారీగా హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు కట్టారు. ఇందుకోసం కొంతమంది అభిమానులు రూ. లక్షల ఖర్చు పెట్టుకున్నారు. తెల్లారితే ఫంక్షన్ జరగాల్సి ఉండగా రాత్రి 10 గంటలకు కార్యక్రమం రద్దు అంటూ సమాచారం వచ్చింది. దీంతో అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్షల రూపాయలు ఖర్చు చేసి ఫ్లెక్సీలు వేశామని, వాటిని కట్టినంత సేపు కూడా సంతోషం లేకుండా పోయిందని వాపోతున్నారు. అల్లు అర్జున్ నటించిన పుష్పకు ధీటుగా కలెక్షన్లు రాబట్టాలని, ఆ లెవెల్లో హైప్ క్రియేట్ చేయాలని చూసిన సినిమా టీంకు తిరుపతి తొక్కిసలాట రూపంలో భారీ దెబ్బ తగిలిందని సర్వత్రా చర్చ జరుగుతోంది.

తిరుపతి ఘటనకు సీఎం బాధ్యత వహించాలి

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



అనంతపురం కార్పొరేషన్: తిరుపతిలో ఆరుగురు భక్తుల మృతికి సీఎం చంద్రబాబు పూర్తి బాధ్యత వహించాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. లక్షలాది మంది భక్తులు వస్తారని తెలిసి కూడా ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడం అన్యాయమన్నారు. సీఎం చంద్రబాబు పర్యటనకు మాత్రం వేల మంది పోలీసులతో బందోబస్తును ఏర్పాటు చేశారన్నారు. ఇంత జరిగినా హిందుత్వం గురించి మాట్లాడే నాయకులు ఎందుకు నోరు మెదపడం లేదని, మౌనంగా ఉండటం దేనికి సంకేతమని ప్రశ్నించారు. మంచి జరిగితే తన గొప్ప అని చెప్పుకోవడం, చెడు జరిగితే వైఎస్సార్ సీపీపై అపవాదు మోపడం చంద్రబాబుకు పరిపాటిగా మారిందని విమర్శించారు. తిరుపతి చరిత్రలో ఎన్నడూ ఇటువంటి దారుణమైన ఘటన చోటు చేసుకోలేదన్నారు. కొందరు అధికారులను మాత్రమే ఇందుకు బాధ్యులను చేయడం దుర్మార్గమన్నారు. మృతులు, క్షతగాత్రులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. టోకన్ల పద్ధతిని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకువచ్చిందని కొందరు ప్రచారం చేస్తున్నారని, టోకన్ల పద్ధతి ప్రవేశపెట్టినా పకడ్బందీ ఏర్పాట్లు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి పనులకే ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మళ్లీ నేడు శంకుస్థాపన చేయడం దౌర్భాగ్యమన్నారు. కూటమి ప్రభుత్వ ఏడు నెలల కాలంలో ప్రజలకు చేసిందేమీ లేదని దుయ్యబట్టారు.

రీ-సర్వేపై అవగాహన తప్పనిసరి


- ప్రతి అంశంపై స్పష్టత కలిగి ఉండాలి
- ఎక్కడా చిన్న పొరపాటుకూ తావివ్వకూడదు
- జేసీ శివ్‌నారాయణ్ శర్మ ఆదేశం



మాట్లాడుతున్న జేసీ శివ్ నారాయణ్ శర్మ, సమావేశానికి హాజరైన అధికారులు

అనంతపురం అర్బన్: భూముల రీ-సర్వేకు సంబంధించి అన్ని అంశాలపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ ఆదేశించారు. పైలెట్ ప్రాజెక్టు కింద మండలానికి ఒక గ్రామంగా 31 మండలాల పరిధిలో ఎంపిక చేసిన 31 గ్రామాల్లో రీ-సర్వే త్వరలో ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో డిప్యూటీ తహసీల్దార్లు, సర్వేయర్లు, ఇతర సిబ్బందికి గురువారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి సర్వే చేయాల్సి ఉంటుందన్నారు. జాయింట్ ఎల్‌పీఎంలు, భూ విస్తీర్ణం హెచ్చు తగ్గులు తదితర సమస్యలను ఏ విధంగా పరిష్కరించాలనే దానిపై స్పష్టతతో ఉండాలన్నారు. రీ-సర్వే డిప్యూటీ తహసీల్దార్లు మేజిస్ట్రేట్‌గా ఉంటారని, ఏదేని అంశంపై స్పష్టత లేకపోతే తొందరపడి నిర్ణయం తీసుకోవద్దని సూచించారు. సంబంధిత అధికారి దృష్టికి ఆ అంశాన్ని తీసుకెళ్లి స్పష్టత పొందిన తరువాతనే ముందుకు వెళ్లాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్వే, భూ రికార్డుల శాఖ ఏడీ రూప్లానాయక్, డిప్యూటీ తహసీల్దార్లు, సర్వేయర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పల్లెకు పోదాం.. పండుగ చేద్దాం..



ప్రయాణికులతో కిటకిటలాడుతున్న అనంతపురం ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం



బస్సు ఎక్కేందుకు పోటీ పడుతున్న ప్రజలు

పిల్లాపెద్దా తేడా లేకుండా అంతా కలిసి చేసుకునే సంక్రాంతి పండుగ సందడి జిల్లాలో మొదలైంది. సంక్రాంతి అంటేనే పల్లెలు గుర్తుకువస్తాయి. పండుగను పురస్కరించుకుని ప్రభుత్వం పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో పిల్లలు, పెద్దలు గ్రామాల బాట పట్టారు. ఈ క్రమంలో ప్రయాణికులతో గురువారం అనంతపురం ఆర్టీసీ బస్టాండ్ కిటకిటలాడింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



స్వగ్రామం వెళ్తున్న బాలుడు

'పది' విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

- డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం ఎడ్యుకేషన్: వార్షిక పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా విద్యాశాఖ అధికారి(డీఈఓ) ఎం. ప్రసాద్‌బాబు ఉపాధ్యాయులను ఆదేశించారు. గురువారం అనంతపురం రూరల్ మండలం చియ్యేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డీఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులతో మాట్లాడారు. అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు. తరగతి గదుల్లోకి వెళ్లి పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఏయే సబ్జెక్టుల్లో ఎంత సిలబస్ జరిగిందో అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న 'వందరోజుల యాక్షన్ ప్లాన్' గురించి ఆరా తీశారు. రోజూ షెడ్యూలు ప్రకారం స్పెషల్ తరగతులు జరుగుతున్నాయా? అని అడిగారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులలకు మంచి బహుమతి ఇస్తానని విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థుల పట్ల మరింత దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. ఎవరికి వారు తమ సబ్జెక్టులో పిల్లలందరూ ఉత్తీర్ణులవ్వాలనే లక్ష్యం పెట్టుకోవాలన్నారు. పాఠశాలలో సొంత ఖర్చులతో వినాయకుడి ఆలయం



విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న డీఈఓ ప్రసాద్‌బాబు

నిర్మించిన ఆంగ్ల ఉపాధ్యాయుడు కె. భాస్కర్ రెడ్డిని అభినందించారు. గతంలో పాఠశాల విద్యార్థులకు విమాన ప్రయాణ అవకాశం కల్పించిన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు బి. నాగేంద్రకు అభినందనలు తెలిపారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నాణ్యతపై విద్యార్థులతో ఆరా తీశారు. రోజూ మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? అని అడిగారు. డీఈఓ చేతుల మీదుగా విద్యార్థులకు ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు నాగేంద్ర, ప్రసాద్ నాయుడు, ఉమా మహేశ్వర్, భాస్కర్ రెడ్డి, పుల్లయ్య, నివేదిత రాణి, నాగమణి, విజయ భారతి, నళినాక్షి, మంజునాథ్, క్లర్క్ సూర్యనారాయణ పాల్గొన్నారు. అనంతరం డీఈఓ ఆకుతోటపల్లి ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు.

ఇన్‌స్పైర్ కప్ విజేత 'నర్మద వ్యాలీ'

అనంతపురం: ఇన్‌స్పైర్ కప్ విజేతగా నర్మద వ్యాలీ జట్టు నిలిచింది. అనంతపురం స్పోర్ట్స్ విలేజ్‌లో లాలిగా ఫౌండేషన్ సహకారంతో నిర్వహిస్తున్న ఇన్‌స్పైర్ కప్‌లో గురువారం బెంగళూరు, నర్మద వ్యాలీ జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. నర్మదవ్యాలీ మూడు గోల్స్ చేయగా.. బెంగళూరు ఒక గోల్ కూడా చేయక ఓటమి పాలైంది. భారత మాజీ ఫుట్‌బాల్ క్రీడాకారిణి, ఫుట్‌బాల్ కోచ్ అమూల్య కమల్, ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛూ ఫెర్రర్, ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వేణు గోపాల్, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్ జితేంద్ర కుమార్ మిశ్రా, ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయి కృష్ణ తదితరులు విజేత జట్టుకు ట్రోఫీ అందజేశారు.

- కాగా, 2022 నుంచి ఇన్‌స్పైర్ టోర్నీ నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది టోర్నీలో దేశ వ్యాప్తంగా 12 జట్లు పాల్గొన్నాయి. ఏ- టీం



ట్రోఫీతో నర్మద వ్యాలీ జట్టు క్రీడాకారులు

పాయింట్ల పట్టికలో బెంగళూరు జట్టు మొదటి స్థానంలో నిలిచింది. బీ- టీంలో నర్మద వ్యాలీ అగ్రస్థానం సాధించింది. దీంతో ఏ టీంలో మొదటి స్థానంలో ఉన్న బెంగళూరు, బీ-టీంలో మొదటి స్థానంలో ఉన్న నర్మదవ్యాలీ ఫైనల్‌కు చేరాయి. బెంగళూరుపై నర్మదవ్యాలీ విజయం సాధించి ట్రోఫీ అందుకుంది.

క్లుప్తంగా

కుక్కల దాడిలో 10 గొర్రెలు మృతి



మృతి చెందిన గొర్రెలు

శెట్టూరు : కుక్కల దాడిలో 10 గొర్రెలు మృతి చెందాయి. వివరాలు.. శెట్టూరు గ్రామానికి చెందిన రైతు బొమ్మన్న గ్రామ సమీపంలోనే గొర్రెల మందను ఏర్పాటు చేసుకున్నాడు. బుధవారం రాత్రి గొర్రెలను మందలో వదిలి నిద్రపోయాడు. గాఢ నిద్రలో ఉన్న సమయంలో మందపై కుక్కలు దాడి చేశాయి. గురువారం తెల్లవారుజామున నిద్రలేచి చూసేసరికి 10 గొర్రెలు మృతి చెంది కనిపించాయి. విషయం తెలుసుకున్న పశువైద్య శాఖ ఏడీ నాగలింగేశ్వర రెడ్డి, డాక్టర్ ప్రసాద్ అక్కడకు చేరుకుని పరిశీలించారు.

చుక్కలూరు వద్ద దారిదోపిడీ

తాడిపత్రి రూరల్: ఆటోలో వెళుతున్న ఓ మహిళను అడ్డుకుని దారిదోపిడీ చేసిన ఘటన తాడిపత్రిలో సంచలనం రేకెత్తించింది. వివరాలు... తాడిపత్రి సమీపంలోని గన్నెవారిపల్లి కాలనీలో నివాసం ఉంటున్న రేణుక వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తోంది. ఈ నేపథ్యంలో గురువారం తోటి కూలీలతో కలసి ఆటోలో యుగుడూరుకు పొలం పనుల కోసం బయలుదేరింది. చుక్కలూరు సమీపంలో ప్రయాణిస్తున్న ఆటోను స్కార్పియో వాహనంలో వచ్చిన ముగ్గురు వ్యక్తులు అడ్డుకున్నారు. అనంతరం రేణుకను బలవంతంగా ఎత్తుకెళ్లి ఆమె వద్ద శరీరంపై ఉన్న బంగారు కమ్మలు, చైన్, మాటీలను లాక్కొని పులిప్రొద్దుటూరు వద్ద వదిలి ఉడాయించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ శివగంగాధరరెడ్డి తెలిపారు. కాగా, విచారణలో బాధితురాలు, నిందితుల మధ్య పాత కక్షలతో పాటు ఆర్థిక లావాదేవీలు ఉన్నాయని తేలింది.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

- డీసీహెచ్ఎస్ పాల్ రవికుమార్



డాక్టర్లతో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ పాల్ రవికుమార్

కణేకల్లు: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని డీసీహెచ్ఎస్ పాల్ రవికుమార్ హెచ్చరించారు. కణేకల్లు సీహెచ్‌సీని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఓపీ తర్వాత డ్యూటీ డాక్టర్లు తప్పని సరిగా ఆసుపత్రిలో ఉండాలన్నారు. ఎఫ్ఆర్ఎస్ (ఫేస్ రికగ్నిషన్ టైమ్ అటెండెన్స్ సిస్టం) యాప్‌లోనే అటెండెన్స్ వేయాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ముగ్గురు డాక్టర్లపై ఇప్పటికే చర్యలు తీసుకున్నామన్నారు. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. రోగుల వివరాలు నమోదు చేసి దేశంలో ఎక్కడైనా ఆరోగ్యసేవలు పొందేలా చూడటమే ఈ కార్యక్రమం ఉద్దేశమని, వచ్చే వారం నుంచి రోగుల వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ డాక్టర్లు నరేష్, షఫీ, జయశ్రీ, చంద్రశేఖర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

- తిరుపతి దుర్ఘటనపై అనంత వాసుల దిగ్భ్రాంతి
- ప్రభుత్వ వైఫల్యంపై ఆధ్యాత్మిక సంఘాల మండిపాటు
- రాజీనామా చేయాలంటూ డిమాండ్

ఆ పాపం... ప్రభుత్వానిదే



తిరుపతిలో తొక్కిసలాట దృశ్యం (ఫైల్)

అనంతపురం కల్చరల్: హిందువులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే పవిత్ర ముక్కోటి ఏకాదశిని ఈసారి ప్రభుత్వం దయనీయంగా మార్చేసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా దుర్ఘటన జరిగితే దానిని రాజకీయంగా మార్చే ప్రయత్నం చేయడాన్ని అందరూ ఈసడించుకుంటున్నారు. గతంలో చంద్రబాబు తన ప్రచార యావతో పుష్కరాల సమయంలో పదుల సంఖ్యలో ప్రాణాలను బలికొన్న ఘటనను గుర్తు తెచ్చుకుని ఈ ప్రభుత్వ తీరు ఇంతేనంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. తిరుపతి దుర్ఘటనపై వాస్తవాలను కూటమి ప్రభుత్వం కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తుండడాన్ని తప్పుపడుతున్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్న ప్రతిసారీ హిందూ సంస్కృతీసంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు మంటగలిపేలా ఘటనలు చోటు చేసుకుంటున్నాయని గుర్తు చేసుకున్నారు. గతంలో పుష్కరాల సమయంలో 38 మంది, కందుకూరులో 8 మంది, గుంటూరులో ముగ్గురు, రాజమండ్రిలో ఇద్దరు, తాజాగా తిరుపతిలో ఆరుగురు ప్రాణాలు కోల్పోవడంపై జిల్లా వాసులు ఆవేదన వ్యక్తం చేశారు.

బాధ్యతల నుంచి తప్పుకోవాలి



ప్రజల పట్ల చిత్తశుద్ధి లేని పాలకులుంటే ఇలాంటి ఘటనలే జరుగుతాయి. మొన్నటికిమొన్న పుష్కరాల సమయంలో చంద్రబాబు ప్రచారయావకు పదుల సంఖ్యలో బలైతే తాజాగా అంతులేని నిర్లక్ష్యం కారణంగా తిరుపతిలో తొక్కిసలాట చోటు చేసుకుని ఆరుగురు భక్తులు మరణించారు. ఇది చాలా బాధాకరం. ఘటనపై కనీస పశ్చాత్తాపం లేకపోగా 'ఇది దైవ నిర్ణయమంటూ' టీటీడీ ఈఓ చేసిన వ్యాఖ్యలు మరీ దారుణంగా ఉన్నాయి. దుర్ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ సీఎం, ఈఓ వెంటనే బాధ్యతల నుంచి తప్పుకుండే హుందాగా ఉంటుంది.

– జ్వాలాపురం శ్రీకాంత్, దేవదాయ శాఖ మాజీ సలహాదారు, అనంతపురం

పదిరోజుల దర్శనం శాస్త్ర విరుద్ధం



కలియుగ ప్రత్యక్ష దైవంగా భావించే తిరుమలేశున్ని వైకుంఠ ద్వారంలో దర్శనం చేసుకోవడమంటే సాక్షాత్తు భగవంతున్ని ప్రత్యక్షంగా చూసినట్లే. ఏకాదశి ఘడియలు దాటిపోయిన తర్వాత కూడా పదిరోజుల వరకూ వైకుంఠ ద్వార దర్శనం టిక్కెట్లు ఇవ్వడం పూర్తిగా శాస్త్ర విరుద్ధం. ఒక్క రోజులో జరగాల్సింది ఇన్ని రోజులెందుకో కొనసాగిస్తున్నారో అర్థం కాని అంశం.

– విజయ్‌సాయి, సాయి ట్రస్ట్ వ్యవస్థాపకుడు, అనంతపురం

దురదృష్టకరం



ఈసారి పవిత్రమైన తిరుపతిలో ఘోరమైన తప్పు జరిగిపోయింది. ఎంతో మంది ప్రాణాలు గాలిలో కలిసిపోతుంటే అప్పుడే తప్పును ఇతరులపై నెట్టేసే ప్రయత్నం సాగుతోంది. ఇది దురదృష్టకరం. ఇటువంటి వాటిని పునరావృతం కాకుండా చూడాలి.

– హరికిషోర్, శ్రీవారి భక్తుడు, అనంతపురం

భద్రత పెంచలేకపోయారు



ముక్కోటి ఏకాదశికి తిరుపతికి లక్షల్లో భక్తులు తరలి వెళతారనేది జగమెరిగిన సత్యం. అయినా కనీస భద్రత పెంచాలన్న యోచనను టీటీడీ అధికారులు చేయలేదు. కేవలం ఉదాసీన వైఖరి కారణంగానే మునెన్నడూ చూడని ఘోరం జరిగింది. రాజకీయ విమర్శలకిస్తున్న సమయం భక్తుల రక్షణకిస్తే బాగుంటుంది.

– అనంత పద్మనాభ శర్మ, బ్రాహ్మణ ఐక్య వేదిక, అనంతపురం

ముఖ్యమంత్రి చంద్రబాబు క్షమాపణ చెప్పాలి



మాట్లాడుతున్న శ్రీనివాసనాయక్

అనంతపురం టవర్‌క్లాక్: తిరుపతిలో జరిగిన తొక్కిసలాటకు ప్రభుత్వ వైఫల్యమే కారణమని వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్ ధ్వజమెత్తారు. ఇందుకు ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ భక్తులకు సీఎం చంద్రబాబు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గురువారం అనంతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వ నీచ రాజకీయాలతో తిరుమల–తిరుపతి దేవస్థానాలు అపవిత్రమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం పాలకుల నిర్లక్ష్యం వల్లనే తొక్కిసలాట జరిగిందన్నారు. ఇందుకు పూర్తి బాధ్యత వహిస్తూ టీటీడీ పాలక మండలి చైర్మన్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో నాయకులు రామాంజనేయులు, నాగేంద్ర పాల్గొన్నారు.

వృద్ధురాలిని మోసగించి బంగారం అపహరణ



రోదిస్తున్న వృద్ధురాలు నారాయణమ్మ

యాడికి: ఓ వృద్ధురాలిని మోసగించి ఆమె మెడలోని బంగారం గొలుసును దుండగుడు అపహరించుకెళ్లిన యాడికి మండలం చందన గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు.. చందన గ్రామంలో ఈ నెల 14, 15 తేదీల్లో చౌడేశ్వరీ జ్యోతుల ఉత్సవాలు జరగనున్నాయి. ఈ క్రమంలో గ్రామంలోని చాలా మంది ఇళ్లను సుందరంగా ముస్తాబు చేసుకుంటున్నారు. గురువారం మధ్యాహ్నం తపాలా కార్యాలయం సమీపంలో ఒంటరిగా ఉన్న 70 ఏళ్ల వయసున్న నారాయణమ్మను ఓ ఆగంతకుడు కలసి తాను బంగారు, వెండి గొలుసులకు మెరుగు పెడతానని చెప్పాడు. గ్రామంలో చాలా మంది తమ వద్ద ఉన్న పాత నగలకు మెరుగు పట్టించారని నమ్మబలికాడు. దీంతో నారాయణమ్మ తన మెడలోని 2 తులాల బంగారు గొలుసు తీసి మెరుగు పట్టాలని దుండగుడికి ఇచ్చింది. ఆమె కంటి ముందే ఓ గిన్నెలోకి గొలుసు వేసి పసుపు రంగు ద్రావకం కలిపాడు. అనంతరం గొలుసు బయటకు తీసి బ్రష్ చేసి, కడిగిన తర్వాత ఆమె దృష్టి ఏమారుస్తూ ఓ గిన్నెలోకి నకిలీ బంగారం గొలుసు వేసి ఓ గంట ఆగిన తర్వాత తీయాలని సూచించి, తన ఫీజు రూ.100 వసూలు చేసుకుని వెళ్లిపోయాడు. గంట తర్వాత ఇరుగు పొరుగు వారితో తాను బంగారు గొలుసుకు మెరుగు పెట్టించానని, బాగుందో లేదో చెప్పాలంటూ నారాయణమ్మ చూపించింది. చూసిన వారంతా అది గిల్టు నగ అని తెలపడంతో వృద్ధురాలి వేదనకు అంతులేకుండా పోయింది. విషయం తెలుసుకున్న సచివాలయ మహిళా పోలీసు జీవిత అక్కడకు చేరుకుని ఆరా తీశారు. సాయంత్రం నారాయణమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మామిడి పూతను నిలుపుకోండి



పూత దశలో ఉన్న మామిడి

అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మామిడి తోటలు పూత దశకు చేరుకున్నందున మంచి దిగుబడులు సాధించేలా పూతను కాపాడుకోవాలని రైతులకు శ్రీసత్యసాయి జిల్లా ఉద్యానశాఖ డీడీ జి.చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. కీలక సమయంలో మేలైన యాజమాన్య పద్ధతులు, సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.

- తోటల్లో 10 శాతం చెట్లు కూడా పూత పట్టకుంటే ఒక నీటి తడి ఇచ్చి 10 గ్రాముల 13–0–45 + 2 గ్రాముల సూక్ష్మధాతు మిశ్రమాన్ని ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు.
- 25 శాతం మేర పూత వచ్చివుంటే ఒక నీటి తడి ఇచ్చి 1 మి.లీ బ్రాసినోలిడ్ + 0.5 మి.లీ ఇమిడాక్లోప్రిడ్ + 2 మి.లీ హెక్సాకొనజోల్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. .
- 50 శాతానికి పైబడి పూత వచ్చివున్న తోటల్లో 0.3 మి.లీ ప్లానోఫిక్ + 0.3 గ్రాముల థయోమిథాక్సామ్ ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు.
- 75 నుంచి 100 శాతం మేర పూత వచ్చివున్న తోటలు, అలాగే 10 శాతం పిందె పట్టిన తోటల్లో 0.3 మి.లీ స్పైనోసాడ్ ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకుంటే మంచి దిగుబడులు వస్తాయన్నారు.
- ఇక మామిడిని బాగా దెబ్బతీస్తున్న పండుఈగ నివారణకు ఇప్పటి నుంచి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. పండు ఈగను ఆకర్షించే బుట్టలు లేదా మిథైల్ యూజినాల్ టాబ్లెట్స్ లేదా జెల్ ఎకరాకు 5 బుట్టలు కడితే మంచి ఫలితాలు ఉంటాయన్నారు.

వీఆర్ఓలకు ఎస్‌ఏలుగా పదోన్నతి

అనంతపురం అర్బన్: రెవెన్యూశాఖలో ఆరుగురు గ్రేడ్–1 వీఆర్ఓలకు (గ్రామ రెవెన్యూ అధికారి) సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పిస్తూ పోస్టింగ్ ఇచ్చారు. ఈ మేరకు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఉత్తర్వులను గురువారం జారీ చేశారు. ఆరుగురిలో నలుగురిని శ్రీ సత్యసాయి జిల్లాకు కేటాయించారు. కె.నరసింహారెడ్డి (ముదిగుబ్బ), ఎన్.కుమారస్వామి (కక్కలపల్లి), టి.సుధాకర్ (తిమ్మాపురం), ఎస్.పి.విజయ్‌కుమార్ (కుటాగుళ్ల)ను శ్రీ సత్యసాయి జిల్లాకు కేటాయించారు. సి.కొండయ్య (పెద్దపప్పూరు)ను అనంతపురం అర్బన్ తహసీల్దారు కార్యాలయంలో, వై.ఓబుళేసు (పెనకచర్ల)ను డి.హీరేహాళ్ తహసీల్దారు కార్యాలయంలో పోస్టింగ్ ఇచ్చారు.

వీసీ పోస్టులకు దరఖాస్తుల వెల్లువ

- ఎస్కేయూలో పోటీ పడిన 97 మంది
- జేఎన్‌టీయూఏ నుంచి బరిలో 112 మంది



అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, జేఎన్‌టీయూఏ వైస్ చాన్సలర్ పోస్టు దక్కించుకునేందుకు పలువురు పోటీ పడ్డారు. ఆయా వర్సిటీలకు వీసీల నియామకానికి ప్రభుత్వం సెర్చ్ కమిటీలను నియమించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పోస్టులు దక్కించుకునేందుకు ఎవరికి వారు పోటీ పడ్డారు. ఎస్కేయూ నుంచి 97, జేఎన్‌టీయూఏ నుంచి 112 దరఖాస్తులు అందాయి. కాగా, 1982లో స్వయం ప్రతిపత్తితో ఏర్పడిన శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి ఇప్పటి వరకూ 12 మంది వీసీలు పనిచేశారు. అయితే ఇప్పటి వరకూ బీసీ వర్గానికి వీసీ హోదా దక్కలేదు. ఓసీ, ఎస్సీ కేటగిరికి చెందిన వారికే కేటాయిస్తూ వచ్చారు. తాజాగా బీసీలకు వీసీ పదవి అప్పగించాలనే డిమాండ్ వినిపిస్తోంది. గత ప్రభుత్వంలో బీసీ సామాజిక వర్గానికి చెందిన వారికి జేఎన్‌టీయూఏ వీసీ బాధ్యతలు అప్పగించారు. పాలకమండలి భర్తీలోనూ అప్పట్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ కేటగిరి వారితో పాటు మహిళలకూ 50 శాతం స్థానాలు కల్పించారు.

పెళ్లయి ఏడాది.. భార్య ఆత్మహత్య

- భర్త సైతం ఆత్మహత్యాయత్నం
- మొళకాల్మూరు వద్ద సంఘటన
- దంపతులు పామిడివాసులు



సుదర్శన్‌రెడ్డి, ప్రవళిక (ఫైల్)

చెళ్లకెర రూరల్/పామిడి: వరకట్న వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లా మొళకాల్మూర్ తాలూకా గిరిజయ్యనహట్టిలో జరిగింది. వివరాలు.. అనంతపురం జిల్లా పామిడి మండలం పి.కొత్తపల్లి గ్రామానికి చెందిన ప్రవళిక, సుదర్శన్‌రెడ్డికి ఏడాది క్రితం పెళ్లైంది. జీవనోపాధి కోసం మొళకాల్మూర్ వద్ద కాపురం పెట్టారు. అక్కడే ఓ ప్రైవేట్ కంపెనీలో సుదర్శన్‌రెడ్డి పని చేసేవాడు. ఈ క్రమంలో ఈ నెల 7న ప్రవళిక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న ఆమె తల్లిదండ్రులు, బంధువులు పెద్ద సంఖ్యలో గిరిజయ్యనహట్టికి చేరుకున్నారు. భర్త మరింత కట్నం తేవాలని రోజూ భార్యను హింసించేవాడని ఆమె తల్లిదండ్రులు దామోదర్‌రెడ్డి, రంగమ్మ ఆరోపించారు. ఈ క్రమంలోనే తమ కుమార్తెను హత్య చేసి ఆత్మహత్య చేసుకున్నట్లుగా చిత్రీకరించారంటూ విలపించారు. భర్త సుదర్శన్‌రెడ్డి, అత్తమామలు శివారెడ్డి, రాజేశ్వరిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ పరిణామాలతో భయాందోళనకు గురైన సుదర్శన్‌రెడ్డి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. దీంతో అతనిని ఆస్పత్రిలో చేర్పించారు. కాగా, ప్రవళిక మృతదేహాన్ని గురువారం పి.కొత్తపల్లికి తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

12న రెడ్డి వివాహ పరిచయ వేదిక

రాప్తాడు రూరల్: రాయలసీమ రెడ్డి జన సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 12న రెడ్డి వివాహ పరిచయ వేదిక ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు రెడ్డి జన సంఘం వ్యవస్థాపకులు రొద్దం సురేష్‌రెడ్డి గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. అనంతపురం రూరల్ పరిధిలోని పాపంపేట బీఎస్ఎన్ఎల్ టవర్ వెనుక ఉన్న సంఘం కార్యాలయంలో రెడ్డి వివాహ పరిచయ వేదికను ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించనున్నారు. ఆసక్తి ఉన్న వారు పిల్లల బయోడేటాతో హాజరు కావాలి. పూర్తి వివరాలకు చంద్రమౌళీరెడ్డి, దుబ్బర కిషోర్‌రెడ్డి (93902 84296), తోపుదుర్తి రామకృష్ణారెడ్డి (94907 67224), మంత్రి విశ్వనాథ్‌రెడ్డి (99891 38044)ను సంప్రదించవచ్చు.

యువకుడి బలవన్మరణం



మృతుడు శివ

గుత్తి రూరల్: భార్య వేధింపులు తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జి.ఎర్రగుడి గ్రామానికి చెందిన గుండుసాని శివ(35)కు భార్య, ఓ కుమారుడు ఉన్నారు. బేల్దారి పనులతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. కొన్ని నెలలుగా భార్య వరలక్ష్మితో విభేదాలు నెలకొన్నాయి. ఈ క్రమంతో భార్య వేధింపులు తాళలేక జీవితంపై విరక్తి చెందిన శివ... గురువారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పైకప్పునకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటి పక్కన వారు కిటికిలో నుంచి చూసి వెంటనే తలుపు బద్దలు కొట్టి లోపలకు వెళ్లారు. ఉరికి వేలాడుతున్న శివను కిందకు దించి గుత్తిలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే శివ మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై గుత్తి పోలీసులు కేసు నమోదు చేసి, కర్నూలు జిల్లా జొన్నగిరి పోలీసులకు బదలాయించారు.

సదరం క్యాంపులు నిలిపివేత

అనంతపురం మెడికల్: 'ఎన్‌టీఆర్ భరోసా' పింఛన్‌కు సంబంధించి అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో జరిగే సదరం క్యాంపులను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం మంగళ, గురు, శుక్రవారాల్లో జరిగే క్యాంపులు ఆపివేస్తున్నట్లు తెలిపారు. తదుపరి క్యాంపులు నిర్వహించే తేదీని తెలియజేస్తామని పేర్కొన్నారు.

సెలవుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించొద్దు

- ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి వెంకటరమణనాయక్



నారాయణ కళాశాలలో పప్పు నాణ్యతను పరిశీలిస్తున్న వెంకటరమణనాయక్

అనంతపురం ఎడ్యుకేషన్: జూనియర్ కళాశాలలకు రేపటి నుంచి ఈనెల 19 వరకు సంక్రాంతి సెలవులు ప్రభుత్వం ప్రకటించిందని, ఎట్టి పరిస్థితుల్లోనూ సెలవు దినాల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించకూడదని ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి ఎం.వెంకటరమణనాయక్ ఆదేశించారు. గురువారం ఆయన అనంతపురం నగర శివారులోని సోములదొడ్డి సమీపంలోని నారాయణ జూనియర్ కళాశాల, గుత్తిరోడ్డులోని ఎస్ఆర్ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. వసతి, బాత్రూంలు, మరుగుదొడ్లు పరిశీలించారు. భోజన నాణ్యతను పరిశీలించి విద్యార్థులతో కలిసి అక్కడే భోజనం చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కళాశాలలు నిర్వహించాలని ఆదేశించారు.

టీడీపీ నేతల బాహాబాహీ

కళ్యాణదుర్గం రూరల్: పదవుల కోసం టీడీపీలో కుమ్ములాట మొదలైంది. పదవుల కేటాయింపులో ఎమ్మెల్యే ఇష్టమొచ్చినట్లుగా వ్యవహరిస్తున్నారంటూ గురువారం ఏకంగా దాడులు చేసుకున్నారు. వివరాలు.... కళ్యాణదుర్గంలో గురువారం టీడీపీ ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ సమయంలో బ్రహ్మసముద్రం మండల కన్వీనర్ శ్రీరాములు, కంబదూరు మండలానికి చెందిన రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామ్మోహన్‌చౌదరి, అమిలినేని లక్ష్మీనారాయణలో కనీస గుర్తింపు లేకుండా పోయింది. అదే సమయంలో వారి మధ్య విభేదాలు పొడచూపి అసభ్య పదజాలంతో దూషణలకు దిగారు. ఒకరిపై ఒకరు కుర్చీలతో దాడి చేసుకున్నారు.

ఇసుక టిప్పర్ల పట్టివేత



పోలీసుల అదుపులో ఉన్న టిప్పర్లు

బత్తలపల్లి: చిత్రావతి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను పోలీసులు పట్టుకున్నారు. గురువారం ఉదయం బత్తలపల్లి మండలం రామాపురం సమీపంలోని చిత్రావతి నది నుంచి రెండు టిప్పర్లలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తుండగా బత్తలపల్లి ఎస్ఐ సోమశేఖర్.. యర్రాయపల్లి క్రాస్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. అనంతపురానికి చెందిన టిప్పర్ల యజమానిపై కేసు నమోదు చేశారు.

యువకుడి ఆత్మహత్య



మృతుడు శ్రీకాంత్

వజ్రకరూరు: మండలంలోని రాగులపాడు నివాసి చాకలి శ్రీకాంత్ (29) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... బొలెరో వాహన డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్న శ్రీకాంత్‌కు అదే గ్రామానికి చెందిన ఓ వివాహిత మధ్య బుధవారం గొడవ జరిగింది. దీంతో శ్రీకాంత్ అదే రోజు రాత్రి వజ్రకరూరులోని సమీప బంధువు ఇంటికి వెళ్లాడు. గురువారం ఉదయం స్వగ్రామానికి వెళుతున్నట్లు బంధువులకు తెలిపి బయలుదేరి, బోడిసానిపల్లి చెరువు కట్ట వద్ద వేప చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి భార్య నవీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కాగా, శ్రీకాంత్‌పై ఇదివరకే పోక్సో కేసు నమోదై ఉందని పోలీసులు గుర్తు చేశారు.

నామినీ వీఆర్ఏలను పర్మినెంట్ చేయాలి



మాట్లాడుతున్న వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు ఓబులేసు

శింగనమల: జిల్లాలో నామినీ వీఆర్ఏలుగా పని చేస్తున్న వారిని పర్మినెంట్ చేయాలని వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు ఓబులేసు డిమాండ్ చేశారు. శింగనమల తహసీల్దార్ కార్యాలయంలోని సమావేశ భవనంలో వీఆర్ఏల జిల్లా సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత 20 ఏళ్లుగా నామినీ వీఆర్ఏలుగా చాలా మంది పని చేస్తున్నారన్నారు. వీరిలో అర్హత ఉన్నవారికి వీఆర్ఓలుగా, వాచ్‌మెన్‌లుగా, రికార్డు అసిస్టెంట్లుగా, అటెండర్లుగా నియమించాలన్నారు. సమావేశంలో వీఆర్ఏల సంఘం ప్రధాన కార్యదర్శి నాగరాజు, మండల నాయకులు రామాంజనేయులు, ధనుంజయ, శ్రీనివాసులు, మౌలాలీ పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

గుంతకల్లు రూరల్: మండలంలోని కసాపురం సమీప పొలాల్లో గురువారం గుర్తు తెలియని పురుషుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న కసాపురం ఎస్ఐ వెంకటస్వామి అక్కడకు చేరుకుని పరిశీలించారు. కసాపురం గ్రామానికి చెందిన రైతు సోమిరెడ్డి కౌలుకు తీసుకున్న మరో రైతు పొలంలో సాగు చేసిన జొన్న పంట నూర్పిడి కోసం గురువారం యంత్రాన్ని తీసుకువచ్చి పంటకోత పనులు చేపట్టాడు. ఈ క్రమంలో పొలంలో పూర్తిగా కుళ్లిన దశలో పడి ఉన్న పురుషుడి మృతదేహం కనిపించింది. కుక్కలు పీక్కు తినడంతో గుర్తు పట్టేందుకు వీలు లేకుండా ఉంది. వైద్య బృందాన్ని పోలీసులు పిలిపించి అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి వయసు సుమారు 30 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉంటుందని నిర్ధారించారు. 30 రోజుల క్రితం మృతి చెంది ఉండవచ్చుననే అనుమానాలు వ్యక్తమయ్యాయి. నల్ల రంగు తెల్లటి చుక్కలు కలిగిన షార్ట్ (నిక్కర్) ధరించి ఉన్నాడు. వ్యక్తి మిస్సింగ్ కేసులో సంబంధీకులు ఎవరైనా ఉంటే 94409 01865లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

క్లుప్తంగా

నేడు విద్యాశాఖ అధికారుల సమావేశం

అనంతపురం ఎడ్యుకేషన్: 'ప్రతి గ్రామ పంచాయతీలోనూ మోడల్ ప్రాథమిక పాఠశాలల ఏర్పాటు, బోధనా సిబ్బంది పునర్విభజన' అంశాలపై శుక్రవారం సాయంత్రం 4:30 గంటలకు అనంతపురం నగర శివారు పంగల్ రోడ్డు ఆర్డీటీ ఆడిటోరియంలో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, సెక్టోరియల్ అధికారులు, నూతన ప్రతిపాదిత స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు తప్పకుండా హాజరు కావాలని ఆదేశించారు.

అమిత్‌షా క్షమాపణ చెప్పాలి



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

అనంతపురం టవర్‌క్లాక్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాను వెంటనే పదవి నుంచి తొలగించాలని కాంగ్రెస్ పార్టీ అర్బన్ ఇన్‌చార్జ్ దాదాగాంధి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగ నిర్మాతను అవమానపరిచిన అమిత్‌షాపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. వెంటనే అతడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వాసు, ఇంతియాజ్, కిశోర్ రెడ్డి, రాంబాబు, పరమేశ్వర రెడ్డి, మూర్తి, శర్మాస్ వలి, ఓబులేసు, నిశాంత్ రెడ్డి, శివా రెడ్డి, రాజు, ప్రసాద్ రెడ్డి, షఫి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే దేశ సారథులు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కళాశాల ట్రెజరర్ కె.రమ

రాప్తాడు: భవిష్యత్తు దేశాన్ని నడిపించేది నేటి విద్యార్థులే అని మాంటిస్సోరి ఎలీట్ పాఠశాల ప్రెసిడెంట్ కె.సునీల్ కుమార్, ట్రెజరర్ కె.రమ అన్నారు. గురువారం మండలంలోని గొల్లపల్లి సమీపంలోని మాంటిస్సోరి ఎలీట్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో పాఠశాల వ్యవస్థాపక దినోత్సవాన్ని కళాశాల ఎండీ కృష్ణ భరత్, కరస్పాండెంట్ కృష్ణ సమీరా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం చెప్పినట్లుగా దేశాన్ని నడిపించాల్సిన బాధ్యత యువతపైనే ఉందన్నారు. నేటి బాలలే రేపటి పౌరులని, వారిలో సామాజిక బాధ్యతను పెంపొందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉందన్నారు. పరీక్షల సమయంలో సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సివిల్స్, గ్రూప్స్ పరీక్షలపై పాఠశాల స్థాయి నుంచే అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

చికిత్స పొందుతూ బేల్దారి మృతి

అనంతపురం: ఈనెల మూడో తేదీన ప్రమాదవశాత్తూ కిందపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ బేల్దారి గురువారం మృతి చెందాడు. మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ కే.శాంతిలాల్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురానికి చెందిన ఓబులేసు (52) మూడు నెలల క్రితం అనంతపురంలో బేల్దారి పనుల నిమిత్తం వచ్చాడు. ఈనెల మూడో తేదీన ఐదో రోడ్డులో ఓ భవనంలో ఇంటిలో బేల్దారి పని చేస్తుండగా.. ప్రమాదవశాత్తూ కిందపడ్డాడు. మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ సర్వజనాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో గురువారం మృతి చెందాడు. ఓబులేసుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఒక కుమారుడికి మానసిక స్థితి బాగోలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

క్యాలెండర్ విడుదల



క్యాలెండర్ విడుదల చేస్తున్న ఎంపీటీసీలు

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో గురువారం వైఎస్సార్‌టీఏ క్యాలెండర్‌ను ఎంఈఓలు మున్వర్ బాషా, ప్రసూన్ కుమార్ నాయుడు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేశవరెడ్డి, శ్రీరాములు, విశ్వనాథరెడ్డి, భాస్కర్‌రెడ్డి, వెంకట లక్ష్మమ్మ, చెన్నకృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, నిర్మలమ్మ, చెన్నారెడ్డి, రవీంద్రరెడ్డి, జయరామిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సర్వ పాపహరణం..
వైకుంఠ ద్వారం

- అర్ధరాత్రి నుంచే ప్రారంభమైన ముక్కోటి ఏకాదశి
- ఆలయాలకు పోటెత్తుతున్న భక్తజనం



ముస్తాబైన చెన్నకేశవాలయం

అనంతపురం కల్చరల్: సకల పాపహరణంగా భావించే ముక్కోటి ఏకాదశి పర్వదినానికి వైష్ణావాలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. పరమ పవిత్రమైన ఏకాదశిని 'వైకుంఠ ఏకాదశి' పర్వదినంగా ఏటా మార్గశిరమాస శుక్ల పక్ష ఏకాదశి రోజున జరుపుకుంటారు. దక్షిణాయణము నుంచి ఉత్తరాయణములోకి సూర్యభగవానుడు ప్రవేశించే రోజుగా కూడా ఈ రోజు ప్రసిద్ధి. ఉత్తరాయణ ప్రారంభమే ముక్కోటి ఏకాదశి. మహావిష్ణువుకు అత్యంత ప్రీతిపాత్రమైన దినాల్లో ముక్కోటి అతి ముఖ్యమైందిగా అందరూ భావిస్తారు. ఆనాడు ఉత్తర ద్వారం గుండా స్వామిని దర్శించుకుంటే సకల పాపాలు తొలగడమేగాక, జన్మరాహిత్యము కల్గుతుందన్నది అందరి నమ్మకం. తదనుగుణంగానే ముక్కోటి నాడు వైష్ణవాలయాలన్నీ భక్తులతో పోటెత్తుతాయి. సాక్షాత్తు భగవంతుడిని ఉత్తర ద్వారంలో దర్శించుకునే పవిత్రమైన రోజు కావడంతో ఈ దినానికి విశేష ప్రాముఖ్యత ఉంది. అందువల్లే భక్తులు అతి కష్టమైనా గజగజ వణికే చలి ఉంటున్నా తెల్లవారుజాము నుంచే బారులు తీరి స్వామి దర్శనంతో అంతులేని ఆనందాన్ని ఆస్వాదిస్తారు.

విద్యుద్దీపకాంతుల్లో వైకుంఠవాసుడు

ఏకాదశి ఘడియలు వచ్చేయడంతో ప్రధాన ఆలయాల్లో గురువారం అర్ధరాత్రి నుంచే భక్తులకు స్వామి వారి దర్శనం ఏర్పాటు చేశారు. మోక్షమార్గాన్ని చూపే వైకుంఠ ద్వారదర్శనంగా కీర్తింపబడిన 'ముక్కోటి ఏకాదశి' పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. భక్తసందోహాన్ని దృష్టిలో ఉంచుకుని బారికేడ్లు నిర్మించారు. ముఖ్యంగా పాతూరులోని చెన్నకేశవస్వామి ఆలయం, ఆర్ఎఫ్ రోడ్డు, రాంనగర్, హౌసింగ్ బోర్డు తదితర, లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయాల్లో వైకుంఠ ద్వారా దర్శనానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లు జరిగాయి. అదేవిధంగా శుభాలు కల్గించే ఏకాదశినాడు స్థానిక రెవెన్యూ కాలనీలోని రామాలయంలో అఖండ విష్ణు సహస్ర నామ పారాయణం ద్వాదశ వరకు కొనసాగే ఏర్పాట్లు చేశారు. ఇవేకాకుండా ఉమానగర్‌లోని కోదండ రామాలయం, మొదటి రోడ్డులోని ప్రాచీన కాశీవిశ్వేశ్వరాలయం, అశోక్‌నగర్‌లోని రమాసమేత సత్యనారాయణస్వామి ఆలయం, శివకోటి తదితర చోట్ల వైకుంఠ ఏకాదశి ప్రత్యేక పూజలకు సర్వం సిద్ధం చేశారు. ముక్కోటి నాడు మహావిష్ణువు దర్శనం కోసం భక్తులకు అనేక సౌకర్యాలతో పాటు స్వామివారి విశిష్టతను తెలిపే పుస్తకాలను కొన్నిచోట్ల వితరణ చేస్తున్నారు. శ్రీవైష్ణవ సంఘం ఆధ్వర్యంలో తపోవనంలోని శ్రీక్షేత్రంలో ముక్కోటి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్టు సంఘం అధ్యక్షుడు జ్వాలాపురం శ్రీకాంత్ తెలిపారు.

కూటమి పాలనలో రైతులకు అన్యాయం



జిల్లా కమిటీ సమావేశంలో పాల్గొన్న రైతు సంఘం నాయకులు

అనంతపురం అర్బన్: కూటమి ప్రభుత్వ పాలనలో రైతులు కన్నీళ్లు పెట్టుకునే దుస్థితి వచ్చిందని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈనెల 17న విజయవాడలో జరగనున్న ధర్నాలో రైతులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గురువారం స్థానిక గణేనాయక్ భవన్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు తరిమెల నాగరాజు అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. పెట్టుబడి సాయం రూ.20 వేలు రైతు ఖాతాల్లో జమ చేయాలన్నారు. కరువుకు గురైన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ వెంటనే ఇవ్వాని కోరారు. ఉచిత పంటల బీమా కొనసాగించి, ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ అదనపు చార్జీలు రద్దు చేయాలన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించాలన్నారు. వెనుకబడిన ప్రాంతాలకు సాగునీటి ప్రాజెక్టులకు నిధులు విడుదల చేయాలని సూచించారు. హంద్రీ-నీవా కాలువ సామర్థ్యం 12 వేల క్యూసెక్కులకు పెంచాలన్నారు. ఉల్లి, టమాట, పత్తి, ఎండుమిర్చి ధరలు పడిపోకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పాడి రైతులకు పొరుగు రాష్ట్రాల్లో ఇస్తున్న విధంగా లీటరు పాలకు రూ.5 బోనస్ ఇవ్వాలని కోరారు. ఉద్యాన పంటలకు అనుబంధంగా జ్యూస్ ఫ్యాక్టరీలో కోల్డ్‌స్టోరేజ్ ఏర్పాటు చేయాలన్నారు. కంపెనీ చట్టం కింద ఉన్న పాల డైయిరీలను సహకార చట్టంలోకి తీసుకురావాలని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు శివారెడ్డి, మధుసూదన్, రాజారాం రెడ్డి, బీహెచ్‌రాయుడు, పోతులయ్య, వెంకటనాయుడు, నారాయణరెడ్డి, ఈరప్ప, నాగమ్మ, చిందంబరమ్మ, సువర్ణమ్మ, కొండారెడ్డి, శ్రీనివాసులు, మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వరాలయంలో డీసీ తనిఖీలు

అనంతపురం కల్చరల్: నగరంలోని మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరాలయంలో ఎండోమెంట్ డిప్యూటీ కమిషనర్ పట్టెం గురుప్రసాద్ గురువారం విస్తృత తనిఖీలు చేపట్టారు. కర్నూలు నుంచి జిల్లా కేంద్రానికి వచ్చిన డిప్యూటీ కమీషనర్ కాశీవిశ్వేశ్వరాలయంతో పాటూ పలు ఆలయాల బ్యాంకు అకౌంట్లను, ఎఫ్‌డీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎండోమెంటు సిబ్బంది, ఆలయ అర్చకులకు పలు సూచనలను చేశారు. అదేవిధంగా ఏసీ కార్యాలయంలోనూ సోదాలు చేపట్టారు. అంతకు ముందు ఆలయంలో డీసీతో పాటూ దేవాదాయశాఖ సహాయ కమీషనర్ ఆదిశేషనాయుడు, ఆలయ ఈఓ రమేష్ బాబు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ప్రధాన అర్చకులు వారికి తీర్థప్రసాదాలు అందజేశారు.

జాగ్రత్తలు తీసుకోవడంలో విఫలం



'ముక్కోటి ఏకాదశి పర్వదినాన భక్తులు అధిక సంఖ్యలో వస్తారని తెలిసి కూడా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలం చెందింది. ఏటా స్వామి వారి దర్శనానికి భక్తులు వస్తారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కల్గకుండా చర్యలు తీసుకున్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం కనీస జాగ్రత్తలు తీసుకోలేదు. కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వర స్వామి ఆలయం కేంద్రంగా తిరుపతి లడ్డూ వివాదం తెరపైకి తెచ్చిన కూటమి ప్రభుత్వం, భక్తులకు సౌకర్యాలు కల్పించక పోవడం దారుణం.

– వసీం, మేయర్

విచారణ జరిపించాలి



'తిరుపతి చరిత్రలో లేని విధంగా తొక్కిసలాటలో ఆరుగురు మృత్యువాత పడ్డారు. ఇది చాలా బాధాకరం. ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుని ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు. కూటమి ప్రభుత్వం బాధ్యత వహించాలి. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పుష్కరాల్లో, ఇప్పుడు తిరుపతిలో భక్తాదులు మృతి చెందారు. ప్రజల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోంది. ఈ ఘటనపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.

– కోగటం విజయభాస్కర్ రెడ్డి, డిప్యూటీ మేయర్

టీటీడీ ప్రతిష్టకు భంగం



కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి ప్రపంచంలోనే అత్యంత ప్రసిద్ధ పుణ్యక్షేత్రం తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతిష్టకు భంగం కల్గుతోంది. ఇప్పటికే లడ్డూ వివాదంతో భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా కూటమి ప్రభుత్వం రాజకీయం చేసింది. ఇప్పుడు భక్తులకు రక్షణ కల్పించడంలో విఫలమైంది. జిల్లా అధికారులు, టీటీడీ అధికారుల్లో సమన్వయం లేదు. 40 ఏళ్ల అనుభవం, హిందువు అని చెప్పుకునే సీఎం చంద్రబాబు ముందుచూపుతో వ్యవహరించ లేదు.

– వాసంతి సాహిత్య, డిప్యూటీ మేయర్

ప్రభుత్వ వైఫల్యంతో భక్తుల మృతి

- తిరుపతి ఘటనపై వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధుల ఆగ్రహం
- కూటమి ప్రభుత్వంలో భక్తులకు రక్షణ కరువు
- టీటీడీ చైర్మన్ రాజీనామా చేయాలని డిమాండ్



తిరుపతిలో టోకెన్ల కోసం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు (ఫైల్)

అనంతపురం కార్పొరేషన్/అనంతపురం రూరల్: కూటమి ప్రభుత్వ వైఫల్యంతోనే తిరుపతిలో ఆరుగురు భక్తులు మరణించారు. ఇందుకు ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలంని వైఎస్సార్‌సీపీ నాయకులు ధ్వజమెత్తారు. టీటీడీ చైర్మన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. గురువారం వారు వేర్వేరుగా విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వం తీరును తప్పుబట్టారు. కూటమి ప్రభుత్వం, భక్తులకు సౌకర్యాల కల్పనలో విఫలమైందని మండిపడ్డారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కనీస ఏర్పాట్లు చేయలేదు



'వైకుంఠ దర్శనానికి భక్తులు వెళితే.. ఏకంగా వైకుంఠానికి కూటమి ప్రభుత్వం పంపింది. లక్షలాది మంది భక్తులు వస్తారని తెలిసి కూడా కనీస ఏర్పాట్లు చేయకపోవడం పాలన యంత్రాంగం వైఫల్యానికి నిదర్శనం. మృతి చెందిన కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం చెల్లించి చేతులు దులుపుకోవడం అన్యాయం. ఒక్కో కుటుంబానికి రూ.కోటి ఇవ్వాలి. మృతుల కుటుంబీకుల్లోని వారికి ఉద్యోగం కల్పించాలి. తొక్కిసలాట ఘటనపై విచారణ జరిపించాలి.

– రమేష్ గౌడ్, వైఎస్సార్‌సీపీ టాస్క్‌ఫోర్స్ సభ్యుడు

ఘటన దురదృష్టకరం



'తిరుపతిలో తొక్కిసలాట ఘటన దురదృష్టకరం. ఆరుగురు భక్తులు మరణించడం, కొందరు గాయపడటం చాలా బాధించింది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఆధ్యాత్మిక క్షేత్రంలో ఘోర అపచారం జరిగింది. మరణించిన వారిని ప్రభుత్వం ఆదుకోవాలి. అదేవిధంగా గాయపడ్డ వారికి మెరుగైన వైద్య చికిత్స అందించాలి. ప్రభుత్వం, టీటీడీ అధికారులు సమన్వయం చేసుకుని భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి. వైకంఠ ఏకాదశి పర్వదినాన మరింత బలమైన సెక్యూరిటీ ఏర్పాటు చేయాలి.

– అశ్వర్థ నాయక్, టీటీడీ మాజీ బోర్డు సభ్యుడు

రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి



వైకుంఠ ఏకాదశి టికెట్ల కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్‌లో జరిగిన తొక్కిసలాట ఘటనకు టీటీడీ చైర్మన్ పూర్తి బాధ్యత వహించాలి. భక్తుల రద్దీని అంచనా వేయకుండా టీటీడీ బోర్డు నిర్లక్షంగా వ్యవహరించడంతోనే ఈ దుర్ఘటన జరిగింది. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించి ఆరుగురు ప్రాణాలను బలిగొన్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి.

– పాపిరెడ్డిపల్లి పృథ్వీ, అఖిల భారత విద్యార్థి బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి

'తల్లికి వందనం' అమలు చేయాలి

అనంతపురం ఎడ్యుకేషన్: కూటమి ప్రభుత్వం వెంటనే 'తల్లికి వందనం' పథకాన్ని అమలు చేసి హామీని నిలబెట్టుకోవాలని ఆల్ ఇండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ (ఏఐఎస్ఈసీ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కమిటీ జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ, కోశాధికారి నాగరాజు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ముందు ఆనాడు అమలులో ఉన్న 'అమ్మ ఒడి' పథకాన్ని పేరు మార్చి 'తల్లికి వందనం' పేరుతో కుటుంబంలో చదువుతున్న ప్రతి పిల్లాడికి సంవత్సరానికి రూ.15 వేలు ఇస్తామని వాగ్దానం చేశారని పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరం (2024-25) ముగియడానికి గడువు సమీపిస్తున్నా ఇప్పటిదాకా 'తల్లికి వందనం' డబ్బు తల్లుల ఖాతాల్లో జమ చేయలేదన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేస్తామని చెప్పడం సరికాదన్నారు. చాలామంది నిరుపేద, మధ్య తరగతి వర్గాల తల్లిదండ్రులు పిల్లలకు 'తల్లికి వందనం' డబ్బులు వస్తాయని తమకు ఆర్థికంగా కొంత వెసులు బాటు కలుగుతుందని ఎదురు చూస్తున్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే ఈ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

మెరుగైన సేవలందించాలి



డాక్టర్ సుభాష్ చంద్రబోస్, డాక్టర్ హరీష్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మాణిక్య రావు

అనంతపురం మెడికల్: బోధనాస్పత్రిలో ముగ్గురు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి లభించింది. గురువారం ఆన్‌లైన్‌లో వివిధ పోస్టులకు సంబంధించి పదోన్నతుల కౌన్సెలింగ్ జరిగింది. సూపర్ స్పెషాలిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్, కార్డియాలజిస్టు డాక్టర్ సుభాష్ చంద్రబోస్, అసిస్టెంట్ ప్రొఫెసర్, నెఫ్రాజలిస్టు డాక్టర్ హరీష్, ప్రభుత్వ వైద్య కళాశాలలో అనాటమీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉన్న డాక్టర్ పద్మజ పదోన్నతి పొందిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి పొందిన డాక్టర్ సుభాష్ చంద్రబోస్, డాక్టర్ హరీష్ గురువారం వైద్య కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావును మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ నిత్యం రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

చెన్నేకొత్తపల్లి: నాగసముద్రం గేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం 60 మంది గర్భిణులకు ప్రధానమంత్రి సురక్షిత్ మాతృ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. హైరిస్క్ గర్భవతులను మండల వైద్యాధికారి డాక్టర్ రవినాయక్ పరీక్షించి మందులు పంపిణీ చేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి



మాట్లాడుతున్న ఎంపీపీ సుబ్బర హేమలత

ఆత్మకూరు: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి అభివృద్ధికి సహకరించాలని ఎంపీపీ సుబ్బర హేమలత అధికారులకు సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. పైప్‌లైన్ లీకేజీలు, వీధి బల్బుల సమ్యలు ఉన్నాయని తెలిపారు. గ్రామాల్లో ఏవైనా పనులు చేపట్టే సమయంలో స్థానిక ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకోవాలన్నారు. గతంలో జరిగిన నాడు-నేడు పనుల్లో కొన్ని పెండింగ్‌లో ఉన్నాయని.. వాటిని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఆరు నెలలు అయినా కొత్త పింఛన్ల దరఖాస్తుకు అవకాశం ఇవ్వలేదని గుర్తు చేశారు. నూతన రేషన్ కార్డులు అందజేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నీటి సమస్య ఉండరాదని.. పారిశుధ్య పనులు చేపట్టాలని తెలిపారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే.. ట్రాన్స్‌కో ఎస్ఈకి తెలియజేస్తామన్నారు.

సమావేశానికి డుమ్మా కొడుతున్న అధికారులు..

ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే ఈ మండల స్థాయి సర్వసభ్య సమావేశానికి అధికారులు సైతం డుమ్మా కొడుతున్నారు., మండల సమావేశమా మనం వెళ్లాలా ? అన్న తీరులో వ్యవహరిస్తున్నారు. గురువారం నిర్వహించిన సమావేశంలో రెవెన్యూ సిబ్బంది అలా వచ్చి ఇలా వెళ్లి పోయారు. అదే విధంగా ఇరిగేషన్, ఎక్సైంజ్ శాఖ అధికారులు రాలేదు. తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని ప్రజా ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి



తహసీల్దార్ విజయకుమారికి వినతిపత్రం ఇస్తున్న వాల్మీకి సేవా సంఘం నాయకులు

రాప్తాడు: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని వాల్మీకి సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.కేశవయ్య డిమాండ్ చేశారు. రాష్ట్ర వాల్మీకి సేవా సంఘం వ్యవస్థాపకుడు బంగారు క్రిష్ణమూర్తి ఆదేశాల మేరకు వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని తహసీల్దార్ విజయ కుమారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో అత్యధిక జనాభా కలిగిన వాల్మీకులు నిలదొక్కుకోవాలంటే ఉద్యోగ, ఆర్థిక, రాజకీయంగా అభివృద్ధి చెందాలన్నారు. రాబోయే 2029 ఎన్నికల్లో అన్ని పార్టీలు వాల్మీకులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలన్నారు. వాల్మీకులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే ఐక్యమత్యంతో ఉండాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ధన, తలారి అక్కులప్ప పాల్గొన్నారు.

కార్మికుడిపై దాడి

తాడిపత్రి రూరల్: పట్టణ సమీపంలోని అనంతపురం బైపాస్ రోడ్డులో బుధవారం రాత్రి పనులు చేస్తున్న మెగా కంపెనీకి చెందిన కార్మికుడిపై దాడి చేశారని అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్‌రెడ్డి గురువారం తెలిపారు. రోడ్డు పనులు చేస్తున్న సునీల్‌కుమార్ పాండే వద్దకు మోటర్ సైకిల్‌లో నలుగురు వ్యక్తులు వచ్చి రాళ్లతో దాడి చేశారన్నారు. అతడి వద్ద ఉన్న సెల్ ఫోన్‌ను తీసుకెళ్లారన్నారు. కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

ఉట్టిపడిన సంక్రాంతి శోభ



నవభారత్ స్కూల్‌లో సందడి చేస్తున్న హరిదాసు



మాంటిస్సోరి స్కూల్‌లో విద్యార్థుల సంబరాలు



శ్రీచైతన్య పాఠశాలలో..

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని వివిధ స్కూళ్లలో గురువారం ముందస్తు సంక్రాంతి ఘనంగా జరుపుకొన్నారు. సంక్రాంతి శోభ ఉట్టి పడింది. ప్రాంగణాల్లో అందమైన రంగవల్లులు వేసేందుకు విద్యార్థినులు పోటీపడ్డారు. భోగిమంటలు వేసి, నృత్యాలు చేశారు. గాలిపటాలు ఎగరవేస్తూ సందడి చేశారు. చిన్నారులకు ఉపాధ్యాయులు భోగిపళ్లు, పాలపొంగులు పెట్టారు. హరిదాసులు, రైతులు వేషధారణలో చిన్నారులు అలరించారు.

గోల్డెన్ బెల్స్‌లో..

ఆత్మకూరు: మండల కేంద్రంలోని గోల్డెన్ బెల్స్ పాఠశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. తొలుత పాఠశాల ఆవరణలో విద్యార్థినులు రంగురంగుల ముగ్గులు వేశారు. పాఠశాల సిబ్బంది పిల్లలతో గాలిపటాలు ఎగురవేయించారు. భోగి మంటలు వేసి నృత్యం చేస్తూ సందడి చేశారు.



ఆత్మకూరు: భోగి మంటలు వేసి నృత్యం చేస్తున్న విద్యార్థులు

యువర్స్

చిన్నప్పుడు కన్న కలలు నిజం అవుతాయా? మనసు పెడితే, కష్టపడితే 'కచ్చితంగా నిజం అవుతాయి' అని చెప్పడానికి బలమైన ఉదాహరణ కాజల్, హితేంద్రసింగ్. 'స్పానిక్' స్టార్టప్‌తో తమ కలను నిజం చేసుకున్నారు... రాకెట్‌ను ప్రయోగించే ప్రక్రియలో కాలంతో పాటు ఎంతో పురోగతిని చూస్తున్నాం. దీనికి సరికొత్త చేర్పు...స్పానిక్. రీయూజబుల్ రాకెట్ లాంచ్ వెహికిల్స్ కోసం కాజల్ రాజ్జర్, హితేంద్రసింగ్ 'స్పానిక్' అనే స్టార్టప్‌ను ప్రారంభించారు.

● ఇన్నోవేషన్


● హితేంద్రసింగ్ ● కాజల్

స్కై స్టార్స్

'పునర్వినియోగ రాకెట్ లాంచ్ వెహికిల్స్‌ను స్పానిక్ అభివృద్ధి చేస్తుంది. అంతరిక్ష పరిశోధనలను అందరికీ మరింత అందుబాటులోకి తీసుకురావాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. మేము దీన్ని ఫెడెక్స్ టు స్పేస్ అని పిలవడానికి ఇష్టపడతాం' అంటున్నారు కాజల్, హితేంద్రసింగ్.

దిల్లీ కేంద్రంగా మొదలైన 'స్పానిక్' ఇప్పటికే గణనీయమైన పురోగతిని సాధించింది. ప్రభుత్వ గ్రాంట్లను పొందింది. ప్రైవేట్ ఈక్విటీ ఇన్వెస్టర్‌ల దృష్టిని ఆకర్షించింది. మోస్ట్ ప్రామిసింగ్ స్టార్టప్ 'టెక్ 30' జాబితాలో చోటు సాధించింది.

చిన్నప్పుడు పిల్లలు ఏవో కలలు కంటారు. అయితే ఆ కలలు అన్నీ నిజం కాకపోవచ్చు. చిన్న వయసులోనే 'నేను పెద్దయ్యాక స్పేస్ కంపెనీ నడపాలనుకుంటున్నాను' అని తండ్రితో చెప్పింది కాజల్. అంతేకాదు 'సొంతంగా రాకెట్లు, ఉపగ్రహాలు తయారు చేస్తాను' అని తన డైరీలో కూడా రాసుకుంది. తన లక్ష్యసాధనలో భాగంగా చెన్నైలోని ఎస్ఆర్ఎంలో చేరింది. అక్కడ ఫిజిక్స్ చదువుకున్న కాజల్ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక పేజీని నడిపేది. కొత్త శాస్త్రీయ ఆవిష్కరణల గురించి అందులో రాసేది. ఈ క్రమంలో కాజల్‌కు అహ్మదాబాద్‌లో చదువుకుంటున్న హితేంద్ర సింగ్‌తో పరిచయం అయింది. కాజల్‌లాగే సింగ్ కూడా చిన్నప్పుడు ఎన్నో కలలు కనేవాడు.

సోషల్ మీడియా ద్వారా పరిచయం అయిన కాజల్, హితేంద్రసింగ్‌లు సైన్స్‌కు సంబంధించి బోలెడు విషయాలు మాట్లాడుకునేవారు. అలా 'స్పానిక్' కోసం స్కెచ్ వేశారు.

ఆస్ట్రోఫిజిక్స్, కాస్మోలజీలో మాస్టర్స్ చేయడానికి గుజరాత్‌లోని 'చరోతార్ యూనివర్శిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ' చేరారు. తమ భవిష్యత్ లక్ష్యమైన 'స్పానిక్' కోసం కాలేజీ వదిలిపెట్టారు. కంపెనీ స్థాపించడానికి ముందు మానవ రహిత వైమానిక వాహనాలను (ఏరియల్ వెహికిల్స్) అభివృద్ధి చేయడం నుంచి యువిసి రోవర్ తయారీ వరకు ఎంతో అనుభవ జ్ఞానాన్ని సంపాదించారు.

అంతరిక్ష రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యానికి ప్రభుత్వం ఇచ్చిన ప్రోత్సాహం 'స్పానిక్' వడివడిగా అడుగులు వేయడానికి ఉపయోగపడింది. రీసైకిల్ చేయదగిన రాకెట్‌ల డిమాండ్‌ను అర్థం చేసుకోవడానికి ప్రైవేట్ సంస్థలు, ఇస్రో సంస్థ ప్రతినిధులతో మాట్లాడారు. నిజానికి పునర్వినియోగ రాకెట్ కాన్సెప్ట్ కొత్త కాదు. రష్యా, అమెరికా, జర్మనీలాంటి దేశాలు దశాబ్దాలుగా ఈ కాన్సెప్ట్‌పై పనిచేస్తున్నాయి. ఈ ప్రయత్నంలో ఖర్చు హద్దులు దాటేది. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఎక్కువగా ఖర్చు కాని, ఎక్కువ సార్లు ఉపయోగించే రాకెట్‌లపై దృష్టి పెట్టారు. ప్రస్తుతం కాజల్-సింగ్ బృందం వర్టికల్ టేకాఫ్ వర్టికల్ ల్యాండింగ్ (విటివిఎల్)ను నిర్మిస్తోంది. వ్యవస్థల పునర్వినియోగాన్ని అర్థం చేసుకోవడానికి ఇది వారికి సహాయపడుతుంది.

అయినా సరే...

చాలామంది స్పేస్ స్టార్టప్ వ్యవస్థాపకులు ఇస్రోలో పనిచేశారు. లేదా ఏదో ఒక హోదాతో సంస్థతో టచ్‌లో ఉన్నారు. మేము 'ఇస్రో'లో పనిచేయలేదు. 'ఇస్రో'లో పనిచేయని ఫౌండర్‌లకు సంబంధించిన స్టార్టప్ మాది. కీలక సాంకేతిక పరిజ్ఞానాన్ని రూపొందించడంపై దృష్టి పెట్టాం. ప్రసిద్ధ సంస్థలకు చెందని వ్యక్తులు కూడా సాంకేతిక స్టార్టప్‌లకు సంబంధించి ముందుకు వెళ్లగలరని నిరూపించాలనుకుంటున్నాం. ఇది ఎంతో మంది ఔత్సాహికులకు ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుంది.

- కాజల్

● టెక్.. టాక్

హానర్ మ్యాజిక్ 7 లైట్



సైజ్: 6.78 అంగుళాలు రిఫ్రెష్‌రేట్: 120 హెచ్‌జడ్
బ్యాటరీ: 6,600 ఎంఏహెచ్ ర్యామ్: 8జీబి స్టోరేజ్: 256 జీబి
వోఎస్: ఆండ్రాయిడ్ 14 బరువు: 189 గ్రా.



రెడ్ మీ బుక్ 14

స్క్రీన్: 16:10
రిజల్యూషన్: 2,880×1,800 పిక్సెల్స్
రిఫ్రెష్ రేట్: 120 హెచ్‌జడ్
బ్యాటరీ: 56 డబ్ల్యూహెచ్


సినీబీమ్ ఎస్(పీయు 615 యు) ఎల్‌జీ ప్రొజెక్టర్



● రిజల్యూషన్: 4కే యుహెచ్‌డీ(3,840×2,160) ● స్క్రీన్ సైజ్: 30-120 అంగుళాలు 40-100 అంగుళాలు ● ఆటో స్క్రీన్ అడ్జస్ట్‌మెంట్ స్పేస్ ● బరువు: 7.5 కేజీ(పిఎఫ్600యు) 2.5కేజీ (పియు615యు) ● సపోర్ట్: డల్బీ ఆటోమస్ సౌండ్ ● లైట్ వెయిట్ డిజైన్

డాక్యుమెంట్స్ స్కాన్ చేయడానికి...

ఇన్‌స్టంట్ మెసేజింగ్ యాప్ వాట్సాప్ ఎప్పటికప్పుడు కొత్త ఫీచర్‌లను అందుబాటులోకి తెస్తోంది. ఈ యాప్‌లో ఎన్నో ఫీచర్‌లు ఉన్నప్పటికీ డాక్యుమెంట్‌లను స్కాన్ చేసి పంపడానికి థర్డ్ పార్టీ యాప్‌లపై ఆధారపడాల్సి వస్తోంది. లేటెస్ట్ అప్‌డేట్‌తో ఐఫోన్ యూజర్‌ల కోసం కొత్త ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకువస్తోంది వాట్సాప్. ఇన్-యాప్ కెమెరాను ఉపయోగించి డాక్యుమెంట్లను స్కాన్ చేసి, వారి కాంటాక్ట్ లిస్ట్‌లో ఉన్న ఎవరితోనైనా షేర్ చేసుకునే అవకాశం కల్పిస్తుంది.



వాట్సాప్‌లో డాక్యుమెంట్స్ స్కాన్ చేయడానికి...
● వాట్సాప్ ఓపెన్ చేసిన తరువాత బాటమ్ బార్‌లోని 'బటన్'ను నొక్కాలి. ● డాక్యుమెంట్స్-సెలెక్ట్ ● 'చూజ్ ఫ్రమ్ ఫైల్స్' 'చూజ్ ఫోటోస్ ఆర్ వీడియో' 'స్కాన్ డాక్యుమెంట్' అనే మూడు ఆప్షన్‌లు కనిపిస్తాయి ● థర్డ్ ఆప్షన్ క్లిక్ చేస్తే ఇన్-కెమెరా ఓపెన్ అవుతుంది ● స్కాన్ చేసిన తరువాత ఇతరులకు షేర్ చేయవచ్చు.

అవును... ఇది నిజమే!



● 'యస్...ఈ పని నేను కచ్చితంగా చేయగలను' అని ఒకటికి పదిసార్లు గట్టిగా అనుకోవడం మనం చేసే పనిపై సానుకూల ప్రభావం చూపుతుంది అంటున్నారు వ్యక్తిత్వ వికాస నిపుణులు.
● జపాన్‌లో 'హీరోషీమా పీస్ ఫ్లేమ్' 1964 నుంచి నిరంతరాయంగా వెలుగుతూనే ఉంది. ● జపాన్‌లో 'థ్యాంకు యూ'కు ప్రత్యామ్నాయంగా '39' వాడుతారు.


● తపస్వీ రెడ్డి

● యంగ్ టాలెంట్

వండర్ బాయ్

టైమ్ మేనేజ్‌మెంట్ తెలిస్తే ఎంతో టైమ్ సేవ్ అవుతుంది. ఆ టైమ్‌లో ఎన్నో విద్యలు నేర్చుకోవచ్చు. 'శభాష్' అనిపించుకోవచ్చు.... దీనికి ఉదాహరణ తపస్వీరెడ్డి

తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు పట్టణానికి చెందిన కుంచాల తపస్వీరెడ్డి కరాటే, ఫ్యాన్సీ డ్రస్, చిత్రలేఖనం, క్విజ్, వక్తృత్వం, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, చదరంగం, ఫోటోగ్రఫీ, సైన్స్, డ్యాన్స్....మొదలైన వాటిలో ప్రతిభ చూపుతున్నాడు. అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించే ఒలింపియాడ్ పరీక్షల్లో కూడా ప్రతిభ కనబరిచాడు. వియత్నాంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ మోడల్ యునైటెడ్ నేషన్స్ సదస్సుకు ఎంపికయ్యాడు.

వందకి పైగా జాతీయ, అంతర్జాతీయ దినోత్సవాలు, తేదీలు వాటికి సంబంధించిన వివరాలను చెప్పి అంతర్జాతీయ 'వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు'లో చోటు సాధించాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే ఛాంపియన్ షిప్ -2024లో అండర్ -14 బ్లాక్‌బెల్ట్ విభాగంలో గోల్డ్ మెడల్, కుమిటేలో కాంస్య పతకం గెలుచుకున్నాడు.

ఇస్రో అంతరిక్ష వారోత్సవాలు 2023ను పురస్కరించుకుని తణుకులో నిర్వహించిన చిత్రలేఖనం పోటీలో, రాజమండ్రిలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌లో ప్రథమ బహుమతి సాధించాడు. ఉత్తర్‌ప్రదేశ్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి ఫోటోగ్రఫీ పోటీలో 674 మందితో పోటీపడి ఐదో స్థానంలో నిలిచి ప్రశంస పత్రం అందుకున్నాడు. ఇంటర్నేషనల్ స్టాండర్డ్ నాలెడ్జ్ ఒలింపియాడ్ 2023-24 రాష్ట్ర స్థాయిలో 5వ ర్యాంక్ సాధించాడు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రోటరీ క్లబ్ వారు నిర్వహించిన ఫాన్సీ డ్రెస్ పోటీలో మహాత్మా గాంధీ వేషధారణతో పాల్గొని ప్రథమ బహుమతి గెలుచుకున్నాడు. యువజన మాసోత్సవాల్లో భాగంగా ఫ్యాన్సీడ్రస్ పోటీలో కృష్ణుడి వేషధారణలో ప్రథమ బహుమతి గెలుచుకున్నాడు.

– గాడి శేఖర్ బాబు, నిడదవోలు, సాక్షి

● గేమింగ్

అపురూప అగ్నితేజం



ఫైనల్ ఫాంటసీ 7(ఫర్ పీసీ) రీబర్త్ ఈ నెలలో విడుదల కానుంది. 'ఫైనల్ ఫాంటసీ 7 రిమేక్'కి సీక్వెల్‌గా వస్తున్న గేమ్ ఇది. రియల్-టైమ్ యాక్షన్‌కు స్ట్రాటజిక్, రోల్-ప్లేయింగ్ ఎలిమెంట్స్ జోడించి రూపొందించిన ఈ గేమ్‌లో క్లౌడ్ స్ట్రైఫ్(ఫైనల్ ఫాంటసీ సిరీస్‌లో ప్రధాన పాత్ర) పార్టీ ఆఫ్ క్యారెక్టర్లు(రెడ్, విన్‌సెంట్, సిడ్, టిఫా, బారెట్...మొదలైన క్యారెక్టర్స్) ప్లేయర్స్ కంట్రోల్ చేయాల్సి ఉంటుంది.

మునుపటి గేమ్‌లలోని ప్రధాన క్యారెక్టర్లు తాజా గేమ్‌లో కూడా కనిపిస్తాయి.

సిరీస్: ఫైనల్ ఫాంటసీ ఇంజిన్: అన్‌రియల్ ప్లాట్‌ఫామ్స్: ప్లేస్టేషన్ 5, విండోస్ జానర్స్: యాక్షన్ రోల్-ప్లేయింగ్
మోడ్స్: సింగిల్-ప్లేయర్

సాక్షి సినిమా

కుటుంబమంతా తల్లి మనసు చూడాలి

- ముత్యాల సుబ్బయ్య

"చిన్న సినిమా, పెద్ద సినిమా... దేనికైనా మంచి కథే ప్రాణం. నా కెరీర్ ఆరంభం నుంచి కూడా కథను నమ్ముకునే సినిమాలు తీశాను. ఈ సృష్టిలో తల్లిని మించిన దైవం లేదు. మా అబ్బాయి అనంత కిశోర్ నిర్మించిన 'తల్లి మనసు' సినిమా అద్భుతమైన కథతో రూపొందింది. ప్రతి తల్లి, కుటుంబమంతా కలిసి చూడాల్సిన చిత్రం ఇది" అని ప్రముఖ సీనియర్ దర్శకులు, చిత్ర సమర్పకులు ముత్యాల సుబ్బయ్య చెప్పారు. రచితా మహాలక్ష్మి, కమల్ కామరాజు, సాత్విక్, సాహిత్య ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'తల్లి మనసు'. ముత్యాల సుబ్బయ్య వద్ద దర్శకత్వ విభాగంలో పని చేసిన వి. శ్రీనివాస్ (సిప్పీ) ఈ చిత్రం ద్వారా దర్శకునిగా పరిచయమవుతున్నారు. ముత్యాల సుబ్బయ్య సమర్పణలో ఆయన తనయుడు ముత్యాల అనంత కిశోర్ నిర్మించిన తొలి చిత్రం 'తల్లి మనసు'. ముత్యాల మూవీ మేకర్స్ పతాకంపై రూపొందిన ఈ చిత్రం ఈ నెల 24న విడుదల కానుంది. ఈ సందర్భంగా ముత్యాల సుబ్బయ్య విలేకరులతో పంచుకున్న విశేషాలు.



● దర్శకుడిగా నా తొలి చిత్రం 'మూడుముళ్ల బంధం'తో మంచి పేరు వచ్చింది కానీ అవకాశాలు రాలేదు. ఆ తర్వాత టి. కృష్ణగారి వద్ద అసోసియేట్ డైరెక్టర్‌గా చేశాను. ఆ తర్వాత నేను దర్శకత్వం వహించిన 'అరుణ కిరణం' (1986) సినిమా సూపర్‌హిట్‌గా నిలిచింది. ప్రముఖ హీరోలందరితోనూ సినిమాలు తీశాను. దర్శకుడిగా 50 సినిమాలు తీశాను.. వాటిలో అద్భుతమైన హిట్‌తో పాటు కొన్ని ఫెయిల్యూర్స్ లేకపోలేదు. అయినప్పటికీ ఏ రోజూ ఏదో సినిమా చేసెయ్యాలని, చుట్టేయాలని అనుకోలేదు. సమాజానికి ఉపయోగపడే పాయింట్‌తో పాటు సెంటిమెంట్, కామెడీ, డ్రామా వంటి అంశాలను మేళవించి సినిమాలు చేశాను. సెంటిమెంట్ సినిమాల కారణంగా నాకు సెంటిమెంట్ సుబ్బయ్య అని పేరొచ్చింది ● నిర్మాతగా నేను ఒక్క సినిమా కూడా తీయలేదు. మా పెద్ద అబ్బాయి అనంత కిశోర్‌కు ఒక మంచి సినిమా తీయాలనే అభిరుచి ఉండటంతో 'తల్లి మనసు' నిర్మించాం. నేను సీనియర్ దర్శకుడిని అయినప్పటికీ శ్రీనివాస్‌కి సూచనలు, సలహాలు ఇచ్చానే తప్ప ఎక్కడా కల్పించుకోలేదు. నా మనసుకి సంతృప్తినిచ్చిన చిత్రమిది. థియేటర్ నుంచి బయటికి వచ్చిన తర్వాత 'ఓ మంచి సినిమా చూశాం' అని ప్రేక్షకులు అనుకుంటారు.



కావేరి పాత్ర నాకో సవాల్

- ప్రగ్యా జైస్వాల్

"'డాకు మహారాజ్'లో నేను కావేరి పాత్ర చేశాను. నటనకు ఆస్కారం ఉన్న మంచి క్యారెక్టర్ ఇది. మొదటిసారి డీ గ్లామరస్ రోల్ చేశాను.. నేనిప్పటి వరకు చేసిన పాత్రలకు భిన్నంగా ఈ క్యారెక్టర్‌ని బాబీగారు అద్భుతంగా తీర్చిదిద్దారు. ఈ పాత్ర చేయడం నాకు సవాల్‌గా అనిపించింది'' అని ప్రగ్యా జైస్వాల్ తెలిపారు. బాలకృష్ణ హీరోగా బాబీ కొల్లి దర్శకత్వం వహించిన చిత్రం 'డాకు మహారాజ్'. ప్రగ్యా జైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్లుగా నటించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రగ్యా జైస్వాల్ విలేకరులతో మాట్లాడుతూ– ''2015లో 'కంచె' సినిమాతో తెలుగులో నా ప్రయాణం మొదలైంది. ఈ ప్రయాణంలో సినిమా గురించి ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. బాలకృష్ణగారితో 'అఖండ, డాకు మహారాజ్, అఖండ-2'.. ఇలా వరుస సినిమాలు చేసే అవకాశం రావడం గౌరవంగా భావిస్తున్నాను. తెలుగులో అగ్ర నిర్మాణ సంస్థల్లో ఒకటైన సితార ఎంటర్‌టైన్మెంట్స్‌లో నటించడం హ్యాపీగా ఉంది. ఈ నెల 12న నా పుట్టినరోజు. నేను నటించిన 'డాకు మహారాజ్'అదే రోజు రిలీజ్ కావడం నా లక్'' అని చెప్పారు.

నా లక్ష్యం నెరవేరింది

- కృష్ణ కాంత్



"తెలుగు సినిమాలకు నేరుగా పాటలు రాయడం సులభం. పైగా కావాల్సినంత స్వేచ్ఛ ఉంటుంది. కానీ, డబ్బింగ్ సినిమాలకు పాటలు రాసేటప్పుడు ఆయా భాషలో వాడిన పదాలకు సరిపోయే తెలుగు పదాలను ఎంచుకుని రాయాలి. అందుకే స్ట్రయిట్ సాంగ్స్‌తో పోలిస్తే డబ్బింగ్ పాటలు రాయడం చాలా కష్టం'' అని పాటల రచయిత కృష్ణకాంత్ (కేకే) చెప్పారు. నేడు (జనవరి 10) ఆయన పుట్టినరోజు. ఈ సందర్భంగా గురువారం కృష్ణకాంత్ విలేకరులతో మాట్లాడుతూ– ''పాటల రచయితగా పేరు తెచ్చుకోవాలని ఉద్యోగం వదులుకుని ఇండస్ట్రీకి వచ్చాను. ఆ లక్ష్యం నెరవేరిందినే సంతృప్తి కలుగుతోంది. 2024లో నేను రాసిన స్ట్రయిట్, డబ్బింగ్ పాటలన్నీ మ్యూజిక్ లవర్స్‌ను ఆకట్టుకుని వైరల్‌గా మారడం సంతోషంగా ఉంది. ఒక సినిమా కథ మొత్తం తెలిస్తే పాటల రచయితకు అడ్వాంటేజ్ ఉంటుంది. అలా నేను సింగిల్ కార్డ్ రాసిన 'పడి పడి లేచె మనసు, సీతారామం (ఐదు పాటలు), సలార్, రాధే శ్యామ్' సినిమాల పాటలన్నీ సూపర్ హిట్ అయ్యాయి. గతేడాది నేను రాసిన పాటల్లో 'హాయ్ నాన్న'లోని 'అడిగా..' పాట బాగా సంతృప్తిని ఇచ్చింది. మలయాళ డబ్బింగ్ మూవీ 'ఏఆర్ఎం', రజనీకాంత్‌గారి 'వేట్టయాన్', శివకార్తికేయన్‌గారి 'అమరన్' సినిమాలకు రాసిన పాటలకు మంచి పేరొచ్చింది. సాటి గీత రచయితలు నాతో స్నేహంగా ఉంటారు. నేను మంచి పాట రాసినప్పుడు చంద్రబోస్ గారు అభినందిస్తారు. ప్రస్తుతం ప్రశాంత్ వర్మ 'అధీర' మూవీకి డైలాగ్స్ రాస్తున్నాను. 'రాజాసాబ్', ప్రభాస్-హను రాఘవపూడి, రామ్ పోతినేని, విజయ్ దేవరకొండ-గౌతమ్ తిన్ననూరి చిత్రాలకు పాటలు రాస్తున్నాను'' అని చెప్పారు.


సాయికుమార్ గోల్డెన్ జూబ్లీ

"కనిపించే ఈ మూడు సింహాలు న్యాయానికి, నీతికి, ధర్మానికి ప్రతిరూపాలైతే, కనిపించని ఆ నాలుగో సింహమేరా.. పోలీస్...' అనే డైలాగ్ వింటే... వెంటనే సాయికుమార్ అని ఆడియన్స్ చెప్పేస్తారు. అంటూ 'పోలీస్ స్టోరీ'లో ఆయన తనదైన శైలిలో పవర్‌ఫుల్‌గా చెప్పి, ఆకట్టుకున్నారు. నటుడిగా, డబ్బింగ్ ఆర్టిస్టుగా ఇండస్ట్రీలో తనకంటూ ఓ ప్రత్యేకతను చాటుకున్న సాయికుమార్ ఇండస్ట్రీలోకి వచ్చి యాభై సంవత్సరాలు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా సాయికుమార్ గురించి కొన్ని విశేషాలు...



1972 అక్టోబరు 20న 'మయసభ' అనే నాటకంలో దుర్యోధనుడి పాత్ర కోసం తొలిసారి మేకప్ వేసుకున్నారు సాయికుమార్. ఆయన వెండితెర ప్రయాణం 'దేవుడు చేసిన పెళ్లి' చిత్రంతో జరిగింది. బాపు దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో సాయికుమార్ బాలనటుడిగా చేశారు. ఈ మూవీ 1975 జనవరి 9న రిలీజైంది. గురువారంతో (జనవరి 9) వెండితెరపై సాయికుమార్ యాభైఏళ్ల నట ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్నారు. ముందు డబ్బింగ్ ఆర్టిస్టుగానే కెరీర్ మొదలుపెట్టారు సాయికుమార్. ఆ తర్వాత 'ఛాలెంజ్, కలికాలం, మేజర్ చంద్రకాంత్' వంటి తెలుగు సినిమాల్లో నటిస్తూనే, 'తయ్యల్‌క్కారన్, కావల్ గీతమ్' వంటి తమిళ సినిమాల్లోనూ నటించారు. 1996లో సాయికుమార్ హీరోగా వచ్చిన కన్నడ చిత్రం 'పోలీసు స్టోరీ' బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఈ సినిమాలోని సాయి కుమార్ నటనకు ఆడియన్స్ ఫిదా అయ్యారు. ఈ సినిమా తెలుగు, తమిళ భాషల్లో అనువాదమై, విజయం సాధించింది. 'పోలీసు స్టోరీ' తర్వాత ఆయన పాతిక చిత్రాల్లో పోలీస్ ఆఫీసర్‌గా నటించారు. ఇక తెలుగులో 'అమ్మ రాజీనామా, కర్తవ్యం, అంతఃపురం, ఈశ్వర్ అల్లా, జగద్గురు ఆది శంకర, ఎవడు, పటాస్, పండుగ చేస్కో, భలే మంచి రోజు, సరైనోడు, జనతా గారేజ్, ఓం నమో వెంకటేశాయ, జై లవ కుశ, రాజా ది గ్రేట్, నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా, మహర్షి, ఎస్ఆర్ కల్యాణమండపం, దసరా, సార్...' ఇలా ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో సాయికుమార్ నటించారు. 50 ఏళ్ల కెరీర్‌లో హీరోగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా మెప్పించిన సాయికుమార్ విలన్‌గానూ నిరూపించుకున్నారు. 'సామాన్యుడు, ప్రస్థానం, ఎవడు..' వంటి చిత్రాల్లో విలన్‌గా చేశారు. కేవలం వెండితెరకు మాత్రమే పరిమితం కాకుండా, బుల్లితెరపై రాణిస్తున్నారు సాయికుమార్. ఇక ఆయన తమ్ముళ్లు అయ్యప్ప పి.శర్మ, పి. రవిశంకర్ డబ్బింగ్ ఆర్టిస్టులుగా, నటులుగా సినిమా రంగంలోనే రాణిస్తున్నారు. ఆయన కొడుకు ఆది సాయికుమార్ హీరోగా చేస్తున్నారు.

సింగర్ జయచంద్రన్ మృతి



ప్రముఖ గాయకుడు పి.జయచంద్రన్(80) ఇకలేరు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన కేరళలోని త్రిసూర్‌లో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ, గురువారం తుది శ్వాస విడిచారు. 1944 మార్చి 3న కొచ్చిలో జన్మించిన జయచంద్రన్ 1965లో వచ్చిన 'కుంజలి మరక్కర్' అనే సినిమాలోని 'ఒరు ముల్లప్పుమలమే..' పాటతో గాయకుడిగా పరిచయమయ్యారు. 1967లో విడుదలైన 'కలితోజన్' చిత్రంలోని 'మంజలైల్ ముంగి తోర్తి' పాట ఆయన కెరీర్‌లో ఒక మైలురాయి. ఆరు దశాబ్దాలకుపైగా తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో దాదాపు 16 వేలకుపైగా పాటలు పాడారాయన. జయచంద్రన్ తెలుగులో పాడిన 'రోజావే చిన్ని రోజావే (సూర్యవంశం), అనగనగా ఆకాశం ఉంది (నువ్వే కావాలి), హ్యాపీ హ్యాపీ బర్త్‌డేలు (సుస్వాగతం)' వంటి పాటలు సూపర్ హిట్‌గా నిలిచాయి. 2002లో వచ్చిన 'ఊరు మనది రా'లో పాడిన 'నా చెల్లి చంద్రమ్మ' తెలుగులో ఆయన చివరి పాట. ఇళయరాజా, ఏఆర్ రెహమాన్, ఎం.ఎం. కీరవాణి, విద్యాసాగర్, కోటి వంటి సంగీత దర్శకుల సినిమాలకు ఆయన ఎక్కువగా పాటలు పాడారు. హిందీలో ఏఆర్ రెహమాన్ సంగీతం అందించిన 'అదా: ఎ వే ఆఫ్ లైఫ్' అనే ఒకే ఒక మూవీలో పాడారు జయచంద్ర. అదేవిధంగా తన మాతృ భాష మలయాళంలో 'నఖక్ష తంగళ్', 'త్రివేంద్రం లాడ్జ్' వంటి సినిమాల్లో అతిథి పాత్రల్లో మెరిశారాయన. అంతేకాదు.. 'శ్రీ నారాయణ గురు' అనే మలయాళ సినిమాలోని 'శివ శంకరా సర్వ శరణ్య విభో..' పాటకుగానూ 'బెస్ట్ మేల్ ప్లే బ్యాక్ సింగర్'గా 1986లో జాతీయ అవార్డు అందుకున్నారు. అలాగే ఐదు కేరళ స్టేట్ ఫిల్మ్ అవార్డులు, రెండు తమిళనాడు స్టేట్ ఫిల్మ్ అవార్డులు కూడా ఆయన్ని వరించాయి. జయచంద్రన్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు, సంగీత దర్శకులు, గాయకులు సంతాపం తెలిపారు.

థ్రిల్లింగ్ బూమరాంగ్


● అనూ ఇమ్మాన్యుయేల్

అనూ ఇమ్మాన్యుయేల్ ప్రధాన పాత్రలో, శివ కందుకూరి, 'వైవా' హర్ష, 'వెన్నెల' కిశోర్, ఎస్. నివాసిని, షానీ సాల్మన్ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'బూమరాంగ్'. ముప్పైకి సినిమాలకుపైగా సినిమాటోగ్రాఫర్‌గా చేసిన ఆండ్రూ బాబు 'బూమరాంగ్' మూవీతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. లండన్ గణేశ్, డా. ప్రవీణ్ రెడ్డి వూట్ల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సితార ఫిల్మ్స్ లిమిటెడ్ లైన్ ప్రొడక్షన్ నిర్వహిస్తోంది. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను హీరో వెంకటేశ్ రిలీజ్ చేశారు. ''కర్మ ఇతివృత్తాన్ని రెండు సమాంతర కథాంశాలతో సీట్ ఎడ్జ్ థ్రిల్లర్ మూవీగా ఈ సినిమాను తీస్తున్నాం. ఈ సినిమా ఆడియన్స్‌కు మంచి అనుభూతినిస్తుంది'' అని యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: అనూప్ రూబెన్స్.